ఆ వ్యాఖ్యలు ఆందోళనకరం

- అలహాబాద్ హైకోర్టు జడ్జి ప్రసంగంపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 128 | విజయవాడ, మంగళవారం 10 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 10 December 2024 | Rs



12వ రౌండ్‌లో గుకేశ్ ఓటమి

ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

6

అదాని ముడుపులపై

దద్దరిల్లిన పార్లమెంట్

వాయిదాల పర్వంలో ఉభయ సభలు

రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసానికి యోచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదాని ముడుపుల వ్యవహారం వరుసగా రెండవ వారం కూడా పార్లమెంట్‌ను కుదిపేసింది. అదాని వ్యవహారంపై జెపిసితో విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే మణిపూర్ అంశం, శంభులో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడి వంటి అంశాలపై చర్చకు పట్టుబట్టాయి. అందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి.

ఈ గందరగోళం మధ్య లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు చేపట్టేందుకు స్పీకర్ ఓం బిర్లా యత్నించారు. ప్రతిపక్ష సభ్యులు అదానీ సంగతి తేల్చాలని పట్టుబట్టారు. అందుకు అధికార పక్షం అడ్డుతగలడంతో సభ ప్రారభమైన 58 సెకెన్లకే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. ఆ తర్వాత మరో రెండు సార్లు వాయిదా పడి చివరికి ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే మంగళవారానికి వాయిదా పడింది.

మరోవైపు రాజ్యసభలో ఇదే తంతు నడిచింది. రాజ్యసభను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రారంభించారు. తొలుత సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. ఆ తరువాత ప్రారంభమైన సభలో ఛైర్మన్ జగదీప్ ధనఖర్, కాంగ్రెస్ ఎంపి జైరామ్ రమేష్ మధ్య వాగ్వాదం సాగింది. సభా సంప్రదాయాలను పక్కన పెట్టి జగదీప్ ధనఖర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని జైరామ్ రమేష్ విమర్శించారు. ఆయన వ్యాఖ్యలపై జగదీప్ ధనఖర్ ఆగ్రహం వ్యక్తం



పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

చేస్తూ సభను వాయిదా వేశారు. సభ సమావేశమైన 14 నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆ తరువాత తొమ్మిది నిమిషాల్లోనే మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా పడుతూ, చివరికి మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశమైంది. సభలో బిలియనీర్ ఇన్వెస్టర్ జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ నేతలు సంబంధాలు ఉన్నాయంటూ బిజెపి నేతలు చేసిన ఆరోపణలపై ప్రతిపక్షం తీవ్ర అభ్యంతరం తెలిపింది. దీంతో మళ్లీ గందరగోళం నెలకొనడంతో సభను ఛైర్మన్ మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసానికి యోచన

రాజ్యసభ ఛైర్మన్ తీరును వ్యతిరేకిస్తూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. రాజ్యసభలో ఛైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. సభలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేటప్పుడు ప్రసంగాలకు అంతరాయం కలిగిస్తున్నారని, క్లిష్టమైన అంశాలపై తగిన చర్చకు అనుమతించడం లేదని, వివాదాస్పద చర్చల సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానంపై ఇండియా బ్లాక్ పార్టీ నేతలు కాంగ్రెస్, టిఎంసి, ఆప్, ఎస్‌పి, సిపిఎం, సిపిఐ తదితర పార్టీల ఎంపీలు 70 మంది సంతకం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బి) కింద ఆ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టనున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు : మల్లికార్జున ఖర్గే

రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌తో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. దేశ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా అన్ని పార్టీలూ ఏకం కావాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అంటుండగా, మంత్రికి ధన్‌ఖర్ మాట్లాడే అవకాశం ఇచ్చారని, ప్రతిపక్షాలను పట్టించుకోలేదని, ఆయన ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. ధన్‌ఖర్.. అధికార పార్టీ ఎంపీల పట్ల మిగతా 5లో



ఆర్‌బిఐ నూతన గవర్నర్‌గా

సంజయ్ మల్హోత్రా

- నేడు శక్తికాంతదాస్ పదవీ విరమణ

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నూతన గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది. శక్తికాంత 2018లో ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం 2021లోనే ముగియగా, మోడీ ప్రభుత్వం మరో మూడేళ్లు పొడిగించింది. ప్రధాని మోడీకి అప్తమిత్రుడిగా గుర్తింపు పొందిన దాస్ పదవీకాలం నేటితో ముగియడంతో కేబినెట్ నియామకాల కమిటీ నూతన గవర్నర్‌గా మల్హోత్రాను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. 1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్‌కు చెందిన మల్హోత్రా ఆర్‌బిఐకి 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నెల 11 నుంచి మూడేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఐఐటి కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అమెరికా ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ చేశారు. మైన్స్, పన్నులు, ఆర్థిక, విద్యుత్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సర్వీసు అనుభవం కలిగి ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని రెవెన్యూ విభాగం సెక్రటరీగా ఉన్న మల్హోత్రా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆర్థికపర, పన్నుల విషయంలో అనుభవం కలిగి ఉన్నారు.



విజయోత్సవ సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు, ఎంఎల్‌సీలు

గోపిమూర్తి ఘన విజయం

మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే గెలుపు

9,165 ఓట్లను సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి

సమీప ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీ

అన్ని రౌండ్లలోనూ కొనసాగిన ఆధిక్యత

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయులు మరోసారి ఉద్యమ నేతకు పట్టం కట్టారు. పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి ఘన విజయాన్ని కట్టబెట్టారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం కాకినాడ జెఎన్‌టియు ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ ఎన్నికలో మొత్తం ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. 16,737 మంది ఓటర్లకుగానూ 15,494 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన 14,680 వ్యాలిడ్ ఓట్లలో విజయానికి అవసరమైన కోటా ఓట్ల సంఖ్య 7,341గా నిర్ధారించారు. గోపిమూర్తికి తొలి రౌండ్‌లోనే 9,165 ఓట్లు వచ్చాయి. ప్రధాన ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు పోలయ్యాయి. పులుగు దీపక్‌కు 102, నామన వెంకటలక్ష్మికి 81, కవల నాగేశ్వరరావుకు 73 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. తొలి రౌండ్‌లోనే కోటాకు మించి ఓట్లు రావడంతో బొర్రా గోపిమూర్తి ఎంఎల్‌సిగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ప్రకటించి ధ్రువపత్రాన్ని అందించారు. సమీప ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీని గోపిమూర్తి సాధించారు.



విజయ చిహ్నం చూపిస్తున్న గోపిమూర్తి

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై గళం విప్పుతా : మీడియాతో గోపిమూర్తి

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి తెలిపారు. సోమవారం ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన అనంతరం మిగతా 5లో

విద్యార్థి దశ నుంచే సమరశీల భావాలు 2

483 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్

- విశాఖ పోర్టులో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టులోని 483 మెట్రిక్ టన్నుల ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యాన్ని సీజ్ చేశారు. పోర్టును మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన టీమ్స్ ఏర్పాటు చేశామని, వారు మిగతా వ్యవహారాలు చూస్తారని తెలిపారు. కాకినాడ పోర్టులో కొంత కాలంగా నిఘా పెరగడంతో విశాఖ పోర్టును అక్రమ రవాణా (స్మగ్లింగ్)కు గేట్‌వేగా కొందరు మార్చుకున్నారని వ్యాఖ్యానించారు. గత రెండు నెలల్లో సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇలా తరలించారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కాకినాడ పోర్టు నుంచి కోటీ 38 లక్షల మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం నుంచి 36 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని మూడేళ్ల కాలంలో తరలించారన్నారు.



విశాఖ పోర్టులో బియ్యం సీజ్ చేస్తున్న మంత్రి మనోహర్

అక్రమ రవాణా అడ్డుకునేందుకు రూ.12,800 కోట్లు

గడిచిన మూడేళ్లలో రూ.12 వేల కోట్ల విలువైన పిడిఎస్ బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేశారని, అందుకే బియ్యం అక్రమ రవాణాపై ప్రక్షాళనకు ప్రభుత్వం రంగంలోకి దిగిందని మంత్రి మనోహర్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రూ.12,800 కోట్లు మేర ప్రభుత్వం ఖర్చు పెడుతోందని ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. అనకాపల్లిలోనూ త్వరలో తనిఖీలు చేపడతామన్నారు.

ఆగ్నేయ బంగాళాఖాతంలో స్థిరంగా అల్పపీడనం

- ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం స్థిరంగా కేంద్రీకృతమైందని, ఈ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 10న అల్లూరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. 11న ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, వైఎస్ఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. 12న తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు, నెల్లూరు, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. కాకినాడ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో మైనార్టీలకు భద్రత కల్పించాలి

- ప్రార్థనా స్థలాల చట్టాన్ని కచ్చితంగా అమలుచేయాలి
- వయనాడ్ బాధితుల పట్ల కేంద్రం వివక్ష వీడాలి
- సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రకటన

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో మైనార్టీ మతస్తులకు పూర్తి స్థాయిలో రక్షణ, భద్రత కల్పించాలని, ప్రార్థనా స్థలాల చట్టాన్ని తు.చ తప్పకుండా అమలు చేయాలని, గ్రేటర్ నోయిడా రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈనెల 7,8 తేదీల్లో రెండు రోజుల పాటు ఇక్కడ సమావేశమైన పొలిట్‌బ్యూరో సోమవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. యుపిలో రైతుల పోరాటానికి మద్దతు తెలిపింది. వయనాడ్ బాధితులకు తక్షణమే నిధులు అందజేయాలని పొలిట్ బ్యూరో డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో మతపరమైన మైనారిటీలకు భద్రత, పూర్తి స్థాయి రక్షణ కల్పించేలా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది. ఇందుకు సంబంధించి ఇస్లామిస్ట్ ఛాందసవాద శక్తుల కార్యకలాపాలను పాలనా యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. అదే సమయంలో, భారత్‌లో ఈ అంశంపై రెచ్చగొట్టే ప్రచారం చేస్తూ ప్రజల మనోభావాలతో చెలగాటమాడేందుకు బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్, తీవ్ర హిందూత్వ సంస్థలు యత్నించడాన్ని పొలిట్‌బ్యూరో నిరసించింది. ఇటువంటి ధోరణి బంగ్లాదేశ్‌లోని మైనారిటీల ప్రయోజనాలకు ఏ విధంగాను తోడ్పడదని పేర్కొంది. భారత్, బంగ్లాదేశ్‌ల్లో సరిహద్దులకు ఇరువైపులా గల ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే అన్ని రకాల మతోన్మాదానికి వ్యతిరేకంగా బలంగా చేతులు కలపాలని ఇరు దేశాల్లోని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

ప్రార్థనా స్థలాల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి

శతాబ్దాల నాటి మసీదులు వున్న ప్రదేశాలన్నీ ఒకప్పుడు ఆలయాలంటూ దిగువ కోర్టుల్లో కేసులు ఎక్కువగా నమోదవుతుండడం పట్ల పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వారణాసి, మధుర తర్వాత ఇప్పుడు సంభాల్‌లో 16వ శతాబ్దానికి చెందిన మసీదుపై సర్వే చేపట్టాల్సిందిగా దిగువ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా హింస చెలరేగింది. నలుగురు ముస్లిం యువకులు మరణించారు. ఆ తర్వాత అజ్మీర్‌లోని సివిల్ కోర్టులో అజ్మీర్ షరీఫ్ దర్గాకి సంబంధించి ఇటువంటి పిటిషనే ఒకటి నమోదైంది. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991ని పరిరక్షించడం ద్వారా ఇటువంటి వ్యాజ్యాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోవడం దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టులో 2019 నాటి ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ చట్టం చెల్లుబాటును, దీని అమలును చాలా స్పష్టంగా సమర్థిస్తూ తీర్పు చెప్పింది. ఆ ఆదేశాల నేపథ్యంలో, సుప్రీంకోర్టు తక్షణమే జోక్యం చేసుకుని, చట్టాన్ని ఉల్లంఘించే ఇటువంటి చట్టపరమైన లావాదేవీలన్నింటికీ స్వస్తి పలకడం అవసరం.

వయనాడ్ బాధితులకు తక్షణమే నిధులు

వయనాడ్‌లో కొండచరియలు కూలిపడి పెను విపత్తు సంభవించిన నేపథ్యంలో బాధితులకు సాయం అందేలా చూడకుండా కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా విమర్శించింది. తక్షణ సాయంగా రూ.214.68 కోట్లు, సమగ్ర పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులకు రూ.2,319.1కోట్లు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసి నాలుగు మాసాలు గడిచినా ఇంతవరకు ఆ నిధులకు ఆమోదం తెలపకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించింది. కొండచరియలు విరిగిపడడాన్ని తీవ్రమైన ప్రకృతి విపత్తుగా ప్రకటించడానికి కేంద్రం నిరాకరించడం, పైగా బాధిత కుటుంబాలకు రుణాలు మిగతా 5లో

రాజ్యసభకు బీద, సతీష్, కృష్ణయ్య

- కూటమి అభ్యర్థులు ఖరారు
- రాష్ట్ర మంత్రివర్గంలోకి నాగబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు టిడిపి కూటమి అభ్యర్థులను ఖరారు చేసింది. టిడిపి నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌లకు రాజ్యసభ అభ్యర్థిత్వం దక్కింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మూడవ రాజ్యసభ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ నుండి ఆర్. కృష్ణయ్య బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి వరకు వైసిపినుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్. కృష్ణయ్య తమ పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికలు అనివార్యమైనాయి. అయితే,రాజీనామా చేసిన ముగ్గురిలో మోపిదేవి వెంకటరమణ తనకు రాజ్యసభ పట్ల ఆసక్తి లేదని మొదటి నుండి చెబుతున్నారు. దీంతో ఆ స్థానం పై జనసేన ఆశలు పెంచుకుంది. కూటమి తరపున ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారంచేయడంతో పాటు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోదరుడు కూడా అయిన కొణిదెల నాగబాబుకు ఆ పదవి దక్కడం ఖాయమన్న అభిప్రాయం కూటమి వర్గాల్లో నెలకొంది. ఈ మేరకు గట్టి హామీ లభించినట్లు కూడా ప్రచారం జరిగింది. దీంతో నాగబాబు రాజ్యసభకు వెళ్లడం ఖాయమని జనసైనికులు భావించారు. ఆయన కూడా పార్లమెంటుకు వెళ్లడానికి ఆసక్తిగా ఉన్నారన్న వార్తలు కూడా వచ్చాయి. అయితే, అనూహ్యంగా ఈ పదవిని బిజెపికి కేటాయించాల్సి వచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో అధికారికంగా నిర్ణయం వెలువడటానికి ముందే, బిజెపి నేతలు ఢిల్లీలో ప్రకటనచేయడం గమనార్హం. ఈ పరిణామం జనసేనలో చర్చనీయాంశంగా మారింది. జనసైనికులతో పాటు నాగబాబు కూడా అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. దీంతో ఆయనకు ఏదో ఒక పదవి ఇవ్వనున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకుంటున్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్రమంత్రివర్గంలో 26 మంది వరకు తీసుకునేందుకు అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం 25 మందే ఉన్నారు. ఖాళీగా ఉన్న స్థానంలో నాగబాబును తీసుకుంటున్నారు. వచ్చే మార్చిలో టిడిపి ఎమ్మెల్సీలుగా ఉన్న అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడు, బి తిరుమల నాయుడు, దువ్వారపు రామారావులతో పాటు మరికొన్ని స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ ఖాళీ స్థానాల నుంచి నాగబాబును ఎమ్మెల్సీగా తీసుకుంటారని భావిస్తున్నారు. మరోవైపు రాజ్యసభకు ఖరారు చేసిన అభ్యర్థులు మంగళవారం అసెంబ్లీ కార్యదర్శిని కలిసి నామినేషను పత్రాలను అందించనున్నారు.



బీద మస్తాన్‌రావు



సానా సతీష్



ఆర్.కృష్ణయ్య



కె.నాగబాబు

సేల్ డీడ్ రద్దు చేసే ముందు బాధితుల వాదన వినాలి

- నోటీసులు ఇవ్వాలి
- చట్టంలో నిబంధన లేకపోయినా చేయాలి
- హైకోర్టు కీలక తీర్పు

2లో..

బిజెపి విచ్ఛిన్నకర విధానాలు దేశానికే ముప్పు

- చంద్రబాబు సంగతి ప్రజలు తేలుస్తారు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్
- నంద్యాల జిల్లా మహాసభ ప్రారంభం

3లో..

ఉన్మాది ఘాతుకం

- ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య

ప్రజాశక్తి- నందికొట్కూరు టౌన్ (నంద్యాల జిల్లా), అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఉన్మాది ఘాతుకానికి ఇంటర్ విద్యార్థిని బలైంది. ఈ ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నందికొట్కూరు పట్టణం బైరెడ్డి నగర్‌లోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం లహరి (17) చదువుతోంది. ప్రేమ పేరుతో ఆమెను రాఘవేంద్ర అనే యువకుడు వేధిస్తుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి ఆమె గదిలోకి ఆ యువకుడు ప్రవేశించాడు. నోట్లో గుడ్డలు కుక్కి ఒంటిపై పెట్రోల్‌పోసి నిప్పటించాడు. లహరి గదిలో నుంచి పెద్ద శబ్దాలు రావడంతో ఆమె అమ్మమ్మ, తాతయ్య తలుపులు తెరిచి చూశారు. అప్పటికే ఆ విద్యార్థిని పూర్తిగా కాలిపోయి మృతి చెంది ఉంది. సగం వరకు శరీరం కాలిన రాఘవేంద్ర పారిపోతుండడంతో చు ట్టుపక్కల వారి సహాయంతో పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. లహరి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటినప్పుడు రాఘవేంద్ర గాయపడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. వెల్దుర్తిలో లహరి, రాఘవేంద్ర కలిసి పదో తరగతి వరకు చదివారు. వెల్దుర్తికి చెందిన రాఘవేంద్రరావు ఈ పరిచయాన్ని ఉపయోగించుకొని ప్రేమ పేరుతో లహరిని వేధించేవాడు. లహరి సొంత గ్రామం వెల్దుర్తి మండలం రామళ్లకోటలోని అమ్మమ్మ, తాతయ్య ఇంట్లో ఉంటూ ఇంటర్ చదువుతోంది. సంఘటనా స్థలాన్ని నంద్యాల జిల్లా ఎస్‌పి ఆదిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. రాఘవేంద్ర పరిస్థితి కూడా విషమంగా ఉందని తెలిపారు. త్వరలో అన్ని విషయాలూ వెల్లడిస్తామని చెప్పారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పరిశీలించారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్నారు. రాఘవేంద్రరావు టెన్త్ తర్వాత చదువు ఆపేసి పువ్వుల వ్యాపారం చేస్తున్నాడు.



లహరి (ఫైల్)

విద్యార్థుల నిరసన ప్రదర్శన

ఈ ఘటన నేపథ్యంలో నందికొట్కూరు జూనియర్ కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యా ర్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిగతా 5లో

మేల్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలి

- యుఎంహెచ్ఇయు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న మేల్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (యుఎంహెచ్ఇయు) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జగన్మోహనరావు, టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబును సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సెలక్షన్ కమిటీల ఆధ్వర్యాన 2001, 2002వ సంవత్సరాల్లో మేల్ హెల్త్ అసిస్టెంట్‌లను నియమించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎప్పటికైనా తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తారనే ఆశతో వీరంతా పనిచేస్తున్నారని, ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మేల్ హెల్త్ అసిస్టెంట్లను తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. దీంతో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న దాదాపు 1,500 మంది తమ ఉద్యోగాలు కోల్పోతారని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. వీరంతా కోవిడ్ సమయంలో కూడా ఉత్తమ సేవలు అందించారని వెల్లడించారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, ధనేకుల మురళీమోహన్, వి.గురునాధం తదితరులు పాల్గొన్నారు. ఎపిసిసి అధ్యక్షులు వై.ఎస్ షర్మిల 'ఎక్స్'లో శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, చెక్కు చెదరని బలంతో కాంగ్రెస్ నాయకత్వానికి సోనియా ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

అర్హులైన మైనార్టీలకు పథకాలు

- మైనార్టీస్ ఫైనాన్స్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీలకు దగ్గరగా ఉంటూ అర్హులైన వారికి ప్రభుత్వం అందించే పథకాలను అందిస్తానని రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పజెప్పిన బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు. మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. మైనార్టీల్లోని పేదరికాన్ని దూరం చేయడానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కిలో టమోటా రూపాయి!

ప్రజాశక్తి - పత్తికొండ

నాలుగు రోజులుగా టమోటా ధరలు పతనమవుతూ వస్తున్నాయి. మూడురోజుల క్రితం కిలో రూ.30-40 పలకగా రెండు రోజుల క్రితం రూ.20 పడిపోయింది. సోమవారం ఓ రైతు తెచ్చిన టమోటాను కిలో రూ.1 వ్యాపారులు అడిగారు. స్థానిక రైతుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా పులికొండకు చెందిన రైతు సుంకన్న 16 గంపల టమోటాను పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చారు. కిలో రూపాయికి అడగడంతో మార్కెటులోనే పారబోసి వెళ్లిపోయారు. వ్యాపారులు కిలో రూ.30తో ప్రజలకు టమోటాను విక్రయిస్తున్నారు. జిల్లా మార్కెట్ వ్యవసాయ అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

బిగ్‌బాస్ షోపై పిల్స్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

అశ్లీలత, అసభ్యత, అనైతిక, హింసాత్మకంగా బిగ్‌బాస్ షో ఉందంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. బిగ్‌బాస్ షో నిలుపుదల ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. ఆ షోపై అభ్యంతరాలను లేవనెత్తేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని చెప్పింది. బిగ్‌బాస్ షో వల్ల యువతను పెడదోవ పట్టిస్తోందంటూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి హైకోర్టులో 2019, 2022 సంవత్సరాల్లో దాఖలు చేసిన రెండు పిల్స్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. పిటిషనర్ కేంద్ర హోంశాఖకు మాత్రమే ఫిర్యాదు చేశారని, సంబంధిత అధికార యంత్రాంగం వద్ద ఫిర్యాదు చేయలేదని పేర్కొంది.

ఆయిల్ ఫెడ్ ప్రైవేటీకరణను ఆపండి : బికెఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఆయిల్ ఫెడ్ ప్రైవేటీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్) డిమాండ్ చేసింది. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుమోలు గాంధీ మాట్లాడుతూ.. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్స్ ఆయిల్ అండ్ ఆయిల్ ఫామ్ వద్ద వేలకోట్లు నిధులు ఉన్నాయని, రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ కొత్త యూనిట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు

విశాఖ డెయిరీపై సమగ్ర దర్యాప్తు

శాసన సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ



డెయిరీలో పర్యటిస్తున్న సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ, సభ్యులు

ప్రజాశక్తి - గాజువాక, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ డెయిరీపై సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉందని శాసన సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ అన్నారు. డెయిరీలో అవినీతి, అక్రమాలపై విచారణకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో జ్యోతుల నెహ్రూతో పాటు కమిటీ సభ్యులుగా ఉన్న పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కెకె.రంగారావు, దాట్ల సుబ్బరాజు సోమవారం గాజువాక సమీపంలోని విశాఖ డెయిరీలో పర్యటించారు. మూడు గంటల పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ప్లాంట్‌లో ప్రాసెస్ యూనిట్‌ను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో నెహ్రూ మాట్లాడుతూ.. విశాఖ డెయిరీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ కోసం స్పీకర్ సభా సంఘాన్ని నియమించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే నిజనిజాలు తేల్చడానికి డెయిరీకి వచ్చామన్నారు. పరిశీలన తరువాత తమకు మరిన్ని సందేహాలు పెరిగాయని తెలిపారు. భవిష్యత్తులో నిపుణుల కమిటీ వేసి, అందులో ఆర్థిక నిపుణులు, కంపెనీ యాక్ట్ నిపుణులు, కో-ఆపరేటివ్ రంగానికి సంబంధించిన ముగ్గురు సభ్యులు అందులో ఉండేటట్లు చూసి, మరలా పరిశీలన జరిపి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. డెయిరీ పరిధిలో పాడి రైతులకు, రైతాంగానికి వైద్యం సరిగా అందడం లేదన్నారు. కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు పెంచకుండా నష్టాల పేరు చెప్పి అసలు విషయాన్ని కంపెనీ డైవర్ట్ చేస్తుందన్నారు. మూడు లక్షల మంది రైతులకు ఎలాంటి ప్రయో జనమూ చేకూర్చడం లేదన్నారు. డెయిరీలో నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాల రైతులకు పాల సేకరణ ధర తగ్గించి, వినియోగదారులకు మాత్రం పాల ధరను పెంచి విక్రయిస్తున్నారన్నారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు.

పలువురు వినతులు అందజేత

డెయిరీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి, పాల రైతుల సంక్షేమాన్ని కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు విశాఖ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ.. విశాఖ డెయిరీ నెల రోజుల క్రితం రైతులతోగానీ, పాల రైతుల సంఘం సభ్యులతోగానీ చర్చించకుండా ఏకపక్షంగా ఆవుపాల ధరలను తగ్గించేసిందన్నారు. డెయిరీ యాజమాన్యంపై వస్తున్న ఆరోపణలను వివరించారు. ఆయన వెంట సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు ఉన్నారు. డెయిరీలో అవినీతి, అక్రమాలపై సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ వినతిపత్రం అందజేశారు.

సేల్ డీడ్ రద్దు చేసే ముందు బాధితుల వాదన వినాలి

- నోటీసులు ఇవ్వాలి
- చట్టంలో నిబంధన లేకపోయినా చేయాలి
- హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ రద్దు చేసే ముందు బాధితుల వాదనలు కూడా వినాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వాదనలు వినే ముందు బాధితులకు నోటీసులు ఇవ్వాలంది. ఏకపక్షంగా రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లను రద్దు చేయడం వల్ల బాధితులు ఆస్తిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉంటుందని చెప్పింది. సహజ న్యాయ సూత్రాల ప్రకారం నోటీసు ఇచ్చి బాధితుల వాదనలు వినాలని జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పు చెప్పారు. ఇలా చేయకపోవడం చట్ట వ్యతిరేకం అవుతుందన్నారు. ఈ విషయం రూల్స్‌లో నిర్దిష్టంగా లేకపోయినప్పటికీ బాధితుల వాదనలు వినకుండా ఏకపక్షంగా చేయరాదన్న సహజ న్యాయసూత్రాలకు కట్టుబడి వ్యవహరించాలని వెల్లడించారు. ఎపి రిజిస్ట్రేషన్ రూల్స్ 26(కె) (1) ప్రకారం రిజిస్టర్ అయిన సేల్ డీడ్స్‌లో పేర్కొన్న ఆస్తులు ప్రభుత్వ లేదా అసైన్డ్ లేదా దేవాదాయ లేదా రిజిస్టర్ చేయడానికి వీలు కాని నిషేధిత భూములని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని తీర్పులో పేర్కొన్నారు. సేల్ డీడ్స్ రద్దుకు రూల్ 26(కె)(1) వర్తించదన్నారు. ఈ రూల్‌లో ఎక్కడా కూడా ఆస్తి స్వభావంపై అధికారులు విచారణ చేపట్టాలని లేదని, ఇదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసిందన్నారు. విశాఖ జిల్లా సబ్బవరం మండలం గాలి భీమవరానికి చెందిన జోరీగల బంగారం తనకు ఇరువాడ, అనకాపల్లిలోని వేర్వేరు సర్వే నెంబర్లలో ఉన్న 4.90 ఎకరాల భూమిని జి నాగేశ్వరరావు, ఎన్ రమణ, షేక్ ఆసిఫ్ పాషాలకు2013లో సబ్బవరం రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారు. వాటిని 2014లో అధికారులు రద్దు చేశారు. వీటిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. 1998లో బంగారం తండ్రికి ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ఇచ్చిన 4.90 ఎకరాలను డీ ఫాం పట్టా కింద ఇచ్చారని పిటిషనర్ వాదన. నోటీసు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా రద్దు చేశారన్నారు.

విద్యుదాఘాతంతో తల్లీ బిడ్డలు మృతి

- అల్లూరి జిల్లాలో విషాదం

ప్రజాశక్తి - పెదబయలు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా పెదబయలు మండలం మారుమూల కిముడుపల్లి పంచాయతీ పరిధి గడుగుపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పివిటిజి తెగకు చెందిన తల్లి, కుమారుడు, కుమార్తె మృతిచెందారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపింది. ఎస్ఐ కె.రమణ కథనం ప్రకారం.. వ్యవసాయ పనులకు వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న కొర్రా సంతోష్ (13) తన ఇంటి దగ్గరలో ఆరబెట్టిన బట్టలను తీయబోయాడు. సమీపంలోని విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. కుమారుని అరుపులు విన్న తల్లి లక్ష్మి (35), చెల్లి అంజలి (10) అక్కడకు చేరుకున్నారు. రక్షించబోయి వారూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి దశ నుంచే సమరశీల భావాలు

అంచెలంచెలుగా ఎదిగిన గోపిమూర్తి



గోపిమూర్తిని అభినందిస్తున్న ఎంఎల్‌సి ఐవి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, అమరావతి బ్యూరో

యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామంలోని గమళ్లపేటలో గోపిమూర్తి జన్మించారు. ప్రాథమిక విద్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, హైస్కూల్ విద్య మట్లపాలెం జడ్‌పి హైస్కూల్లో సాగింది. భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో ఇంటర్, బిఎస్‌సి చదివారు. ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాలలో బిఇడి పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సి మ్యాథ్స్ పట్టా, నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సి కెమిస్ట్రీ పట్టా, ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి ఎంఇడి పట్టా పొందారు. 1998లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పని చేశారు. అత్తిలి మండలం కొమ్మర జడ్‌పి హైస్కూల్లో పని చేస్తూ 12 ఏళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ప్రజా ఉద్యమ సారథిగా, విద్యావేత్తగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థి సంఘంలో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. నేదురుమిల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో క్యాపిటేషన్ ఫీజు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 1991లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాల్లో ఉన్నారు. యుటిఎఫ్‌లో గోపిమూర్తి మండల స్థాయి నుంచి క్రమంగా ఎదుగుతూ కీలక భూమిక పోషించారు. 2023లో యలమంచిలి మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2015లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2021లో రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. గతంలో పశ్చిమగోదావరి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్‌గా, 2017లో జెఎసి జిల్లా కో-ఛైర్మన్‌గా, 2022లో ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2007లో పదో తరగతి మూల్యాంకనం సందర్భంగా ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాడడంతో ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. రెండున్నరేళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. అప్రంటీస్ విధానాలకు వ్యతిరేకంగా సాగించిన పోరు, 2008లో జరిగిన సమ్మెలో గోపిమూర్తి ప్రముఖ పాత్ర పోషించారు. ఎట్టకేలకు 2012లో ప్రభుత్వం అప్రంటీస్ వ్యవస్థను రద్దు చేసింది. సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి పశ్చిమగోదావరి జిల్లా మోగల్లు వరకూ 1700 కిలోమీటర్లు సాగిన మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. 2022లో సిపిఎస్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరులో క్రియాశీల పాత్ర పోషించారు.

ఎపిటిఎఫ్ (1938) హర్షం

గోపిమూర్తి విజయం పట్ల ఎపిటిఎఫ్ (1938) హర్షం వ్యక్తం చేసింది. వివిధ స్థాయిలో పనిచేసిన ఉద్యమ నాయకుడని పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్.చిరంజీవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎపిటిఎఫ్ అమరావతి అభినందలు

గోపిమూర్తి విజయం పట్ల ఎపిటిఎఫ్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సివి ప్రసాద్, రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే ఎలిమినేషన్ విధానం లేకుండా గెలవడం ఉపాధ్యాయుల విజయంగా పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్

- వ్యాన్ డ్రైవర్ సజీవ దహనం
- భోగాపురం సమీపంలో ప్రమాదం

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఇసుక లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో మంటలు చెలరేగి వ్యానులో విశ్రాంతి తీసుకుంటున్న వ్యాన్ డ్రైవర్ సజీవ దహనమయ్యారు. డ్రైవింగ్ చేస్తున్న మరో డ్రైవర్ వాహనం నుంచి దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. భోగాపురం సమీపంలో నారు పేట వద్ద సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు షేక్ షరీఫ్ (27), షేక్ షహనావాజ్ వానులో సరుకు తీసుకొని భువనేశ్వర్ వెళ్లి అక్కడ సరుకు దించి తిరిగి తమ రాష్ట్రానికి బయలుదేరారు. విజయనగరం నారుపేట పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న ఇసుక లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న షమనావాజ్ కిందకు దూకేశారు. షరీఫ్ వ్యానులో చిక్కుకున్నారు. రెండుమూడు నిమిషాల్లో వ్యాన్ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వ్యానులో చిక్కుకున్న షరీఫ్ మంటల్లో సజీవ దహనమయ్యారు. సిఐ ప్రభాకర్, ఎస్ఐలు పాపారావు, సూర్య కుమారి హైవే సిబ్బంది చేరుకొని జాతీయ రహదారిపై వెళ్తున్న మిగతా వాహనాలకు మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన షహనావాజ్‌ను ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన షరీఫ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంటల్లో పూర్తిగా అస్తిపంజరంలా మారిన మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంటన్నర ఆలస్యంగా చేరుకున్న ఫైర్ ఇంజన్

హైవేపై ఉన్న విశాఖ జిల్లా చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి అటు విజయనగరం అగ్నిమాపక కేంద్రానికి పోలీసులు సమాచారం అందజేశారు. 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్టవలస నుంచి కానీ 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయనగరం నుంచి గాని ఫైర్ ఇంజన్లు సకాలంలో చేరుకోలేదని స్థానికులు అంటున్నారు. చివరకు విజయనగరం నుంచి గంటన్నర ఆలస్యంగా ఫైర్ ఇంజన్ చేరుకుంది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.. టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన మంత్రి.. అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి మనోహర్

48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ

రైతుకు అన్నివిధాలా అండగా నిలబడతాం
పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం), లావేరు (శ్రీకాకుళం)

రైతుకు అన్ని విధాలా అండగా నిలబడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు ధాన్యం దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, రవాణా, నగదు జమ, ఇతర సమస్యలపై ఆరా తీశారు. విజయనగరం డెంకాడ మండలం చందకపేట ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సుమారు రూ.1674 కోట్ల ధాన్యం డబ్బులు బకాయి పెట్టిందని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ బకాయిలన్నిటినీ పూర్తిగా చెల్లించిందని చెప్పారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించవచ్చునని, తేమ 17 శాతం వరకు అనుమతి ఉన్నాగాని, తేమ 24 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు.

మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు

శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలోని కలిశెట్టి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాలో రూ.40 కోట్లతో ధాన్యం ఆరబెట్టే పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతం నుంచి వలసలను నివారించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

డిప్యూటీ సిఎం పేషీకి బెదిరింపు కాల్స్

- పవన్ కల్యాణ్‌ను చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆరా తీసిన హోంమంత్రి అనిత
- పోలీసుల దర్యాప్తు • నిందితుడు అరెస్ట్?

ప్రజాశక్తి- విజయవాడ/అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను హత్య చేస్తామంటూ బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీనిపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆరా తీశారు. తనకు రెండు రోజుల క్రితం బెదిరింపులు వచ్చిన నంబర్ నుంచే ఈ కాల్స్ వచ్చినట్లు ఆమె గుర్తించారు. దీంతో, అగంతకుడిని పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించారు. పోలీసుల కథనం ప్రకారం... డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ అగంతకుడి నుంచి ఆయన పేషీకి బెదిరింపు కాల్స్, అభ్యంతరకర భాషలో మెసేజ్‌లు వచ్చాయి. డిప్యూటీ సిఎం పవన్ దృష్టికి ఈ విషయాన్ని పేషీ సిబ్బంది తీసుకెళ్లారు. బెదిరింపు కాల్స్, మెసేజ్‌లపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై సైబర్ క్రైమ్ దర్యాప్తు చేసింది. విజయవాడ బందర్ రోడ్డు నుంచి మల్లికార్జునరావు అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుసుకొని నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. అగంతకుడు రెండుసార్లు ఫోన్ చేసినట్లు డిజిపి తెలిపారు. ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని మంత్రి అనిత పోలీసు అధికారులను ఆదేశించారు.

12న ధర్నా వాయిదా

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ప్రభుత్వాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు, ఎఐటియుసి) ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం మూడు సంఘాలు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ నెల 4న ఐసిడిఎస్ డైరెక్టర్, ముగ్గురు జెడిల సమక్షంలో మినిట్స్ కాపీ ఆధారంగా మూడు సంఘాల రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వెంటనే మట్టి ఖర్చులకు సంబంధించిన జిఓలు ఇస్తామని, మినీ సెంటర్ల విషయం ప్రాసెస్‌లో ఉందని, వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు అంశాలను సిఎం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చినట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు, ఎఐటియుసి) ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) వరుసగా అధ్యక్షులు జి బేబీరాణి, ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, జె లలితమ్మ, విఆర్ జ్యోతి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న తలపెట్టిన ధర్నాలను వాయిదా వేయాలని మూడు సంఘాల రాష్ట్ర కమిటీలు నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. 12న చారిత్రాత్మక 42 రోజుల సమ్మె ప్రారంభించిన రోజు కావడంతో ఆ రోజు సాయంత్రం పిడి/కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో తగ్గని నిరుద్యోగం

- దేశ సగటుకన్నా ఎక్కువ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో నిరుద్యోగుల వివరాలు (శాతంలో)		
గ్రామీణంలో	3.4	(దేశ సగటు 2.5)
మహిళలు	2.9	(దేశ సగటు 2.1)
పురుషుల్లో	3.8	(దేశ సగటు 2.7)
పట్టణాల్లో	5.9	(దేశ సగటు 5.1)
మహిళలు	6.9	(దేశ సగటు 4.4)
పురుషులు	5.5	(దేశ సగటు 7.1)

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం దేశ సగటు కన్నా రాష్ట్రంలో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో 4.5 శాతం కన్నా ఎక్కువ మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు కేంద్ర గణాంకాల్లో పేర్కొన్నారు. దీనిలో గ్రామీణ ప్రాంతాల్లో 3.4 శాతం మంది నిరుద్యోగులుగా ఉండగా, అందులో పురుషులే 3.8 శాతం వరకు ఉన్నట్లు తేలింది. అలాగే మహిళల్లో నిరుద్యోగం 2.9 శాతం వరకు ఉందని లెక్కలు తేల్చారు. 2022-23లో మొత్తం గ్రామీణ నిరుద్యోగం 3.3 శాతం కాగా, తరువాత సంవత్సరానికి మరో శాతం పెరగడం గమనార్హం. మొత్తం గ్రామీణ నిరుద్యోగం జాతీయ స్థాయిలో 2.5 శాతంగా ఉండగా, రాష్ట్రంలో మాత్రం 3.4 శాతం ఉండడం విశేషం. ఇక పట్టణాల్లో నిరుద్యోగం విషయానికి వస్తే మొత్తంగా 5.9 శాతం నిరుద్యోగత ఉన్నట్లు తేలింది.. ఈ విభాగంలో పురుషుల్లో 5.5 శాతం నిరుద్యోగత ఉండగా, మహిళల్లో 6.9 శాతంగా కనిపిస్తోంది. జాతీయ నిరుద్యోగం 5.1 శాతం కాగా, రాష్ట్రంలో 5.9 శాతం ఉండడం గమనార్హం.

విద్యార్థులకు మెరుగైన వైద్యం

- ఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్) కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎయిమ్స్‌తో ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎయిమ్స్ రీసెర్చ్ డీన్ వి దీప్తి, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులో భాగంగా ఎయిమ్స్ వైద్య నిపుణులు కౌమార దశలో ఉన్న పిల్లలతో వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ ప్రాజెక్టు కౌమార దశలో ఏర్పడే అడ్డంకులను పిల్లలు సులభంగా అధిగమించేందుకు సహాయపడుతుందన్నారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ అదనపు కార్యదర్శి కె సునీల్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎన్ సంజీవరావు, ఎయిమ్స్ హెచ్ఒడిలు రాజీవ్ అరవిందాక్షం, విజయ్ చంద్రరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ సత్యనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

జత్వానీ కేసులో విద్యాసాగర్‌కు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో వ్యాపారవేత్త కె విద్యాసాగర్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను సోమవారం మంజూరు చేసింది. బెయిల్ మంజూరు చేయవద్దన్న సిఐడి, జత్వానీ వాదనలను తిరస్కరించింది. తన ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్లను విద్యాసాగర్ ఫోర్జరీ చేశారంటూ జత్వానీ గత సెప్టెంబర్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కింది కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో విద్యాసాగర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ తీర్పు చెప్పారు. పోలీసుల విచారణలో సాక్షులు పలు విషయాలను మార్పు చేస్తూ చెప్పారని గుర్తు చేశారు. గత 77 రోజులుగా పిటిషనర్ జైల్లో ఉన్నారని గుర్తు చేశారు. రూ.50 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, ప్రతినెలా 1, 15వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, 3 నెలలు లేదా చార్జిషీట్ వేసే వరకు దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని.. ఇతర షరతులను విధిస్తూ బెయిల్ పిటిషన్‌పై తీర్పు చెప్పారు.

గోతులు పూడ్చే పనులు వేగవంతం

- ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా రహదారుల మరమ్మతు పనులను మరింత వేగవంతం చేయాలని ఆర్అండ్‌బి శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. నిర్దిష్ట కాల వ్యవధిలో పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని సూచించారు. విజయవాడ ఇఎన్‌సి కార్యాలయం నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రం మొత్తం మీద 45,378 కిలో మీటర్లు రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లు ఉన్నాయని, అందులో 22,299 కిలో మీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. రూ.861 కోట్లతో 2,648 కిలో మీటర్ల మేర రోడ్లను గుంతల రహిత రహదారులుగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. గత ఐదేళ్లపాటు నరకయాతన చూసిన ప్రజలకకు మెరుగైన రహదారులు కల్పించాలనే లక్ష్యంతో రోడ్ల మరమ్మతులకు సంబంధించిన పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకుందన్నారు. కొన్ని జిల్లాల్లో రోడ్ల మరమ్మతుల పనులు వెనుకబడి ఉండటంపై సంబంధిత డివిజన్ అధికారులపై సీరియస్ అయ్యారు. సకాలంలో పనులు పూర్తి కాకపోతే అధికారులపై చర్యలు తీసుకోక తప్పదని మంత్రి హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇఎన్‌సి నయిముల్లా, ఆర్అండ్‌బి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పాత బకాయిలు చెల్లించాలి

- ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ పాత బకాయిల చెల్లింపు ఊసే లేదని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 మే నెల నుంచి ఇప్పటి వరకు పెట్టిన ఉపాధ్యాయుల సరెండర్ లీవులు, ఇతర బకాయిలు ఎవరికీ చెల్లించలేదని వివరించారు. క్రిస్మస్ పండగ సందర్భంగానైనా ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ) : ధాన్యం సేకరణలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. సోమవారం ఆయన విశాఖ బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్‌తో కూడిన కంటైనర్లు వచ్చాయని నాడు తమ ప్రభుత్వంపై మచ్చ తీసుకొచ్చేలా టిడిపి కూటమి నేతలు పలు ఆరోపణలు చేశారన్నారు. ఆపరేషన్ గరుడ, ఇంటర్ పోల్, సిబిఐలను రంగంలోకి దింపి దర్యాప్తు అంటూ హడావిడి చేయించారని చెప్పారు. విశాఖ తీరంలో కంటైనర్‌ను సీజ్ చేసి, ఒకరిద్దరిని అరెస్ట్ కూడా చేశారన్నారు. తీరా ఎనిమిది నెలల తరువాత ఇప్పుడు ఆ కంటైనర్‌లో ఎటువంటి డ్రగ్స్ లేవు అంటూ సిబిఐ క్లీన్ చిట్ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా డ్రగ్స్ పేరుతో చేసిన హైడ్రామా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరో బయటకు రావాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష సాధింపుకు దర్యాప్తు సంస్థలను పావులుగా వాడుకున్నారని, ఆయా సంస్థలపైన ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. ఈ తప్పుడు ఆరోపణలు చేసిన దర్యాప్తు సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశ ప్రధానికి, హోంమంత్రికి కలుస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో వైసిపిని దెబ్బతీయాలన్న కుట్రకోణం దీనిలో దాగుందని అనుమానాలు ఉన్నాయన్నారు. విశాఖ డెయిరీపై విచారణకు నియమించిన సభా సంఘంలో వైసిపి ప్రజాప్రతినిధులకు చోటు లేకపోవడం బాధాకరమని తెలిపారు. రాజకీయ కారణాలతోనే ఎమ్మెల్సీలకు అందులో చోటు కల్పించలేదని భావిస్తున్నామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు, వైఫల్యాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను జనంలోకి తీసుకెళ్తామని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 13న ధాన్యం సేకరణపై, 27న పెంచిన విద్యుత్ ఛార్జీలపై, జనవరి మూడున ఫీజు రీయింబర్స్‌మెంట్ పై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామని తెలిపారు.

బిజెపి విచ్ఛిన్నకర విధానాలు
దేశానికే ముప్పు

- చంద్రబాబు సంగతి ప్రజలు తేలుస్తారు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్
- నంద్యాల జిల్లా మహాసభ ప్రారంభం



నంద్యాల జిల్లా నందికొట్కూరులో ప్రదర్శనకు అగ్రభాగాన ఎం.ఎ.గఫూర్, ధనలక్ష్మి, రమేష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

బిజెపి ప్రభుత్వ విచ్ఛిన్నకర విధానాలు దేశానికే ముప్పు అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. సిపిఎం నంద్యాల జిల్లా రెండవ మహాసభ నందికొట్కూరులో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తొలుత నందికొట్కూరు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ మీదుగా జైకిసాన్ పార్క్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జై కిసాన్ పార్క్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో గఫూర్ మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చేస్తుంటే వారితో మాట్లాడే పరిస్థితిలో మోడీ లేరని, రైతులను కలవడానికి ఇష్టపడని ప్రధాని ఇక సమస్యలను ఏం పరిష్కరిస్తారని ప్రశ్నించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు పెంచడం లేదని, రైతుల రుణాలు మాఫీ చేయకుండా పెట్టుబడిదారులకు పన్నులు, రుణాలు మాఫీ చేస్తున్నారని, ప్రశ్నిస్తే దమనకాండ సాగిస్తున్నారని విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికులు ఆందోళన చేస్తుంటే మోడీ పట్టించుకోవడం లేదన్నారు. అన్ని పార్టీలు జెపిసి వేయాలని కోరుతుంటే అదానీపై విచారణకు ఒప్పుకోనని మోడీ అంటున్నారని తెలిపారు. హిందువులకు, ముస్లిములకు తగాదా పెట్టడమే మోడీ పని అని, ఓట్ల కోసం దేశాన్ని బలిపెడుతున్న మత విషకుంభం బిజెపి అని విమర్శించారు. అదానీ, జగన్ ఒప్పందంపై చంద్రబాబు మాట్లాడటం లేదని, అదానీ రాష్ట్రాన్ని కొల్లగొడుతుంటే అతనిపై చర్యలు తీసుకోవడానికి చంద్రబాబుకు ధైర్యం లేదన్నారు. దుర్మార్గ బిజెపికి మద్దతిస్తున్న చంద్రబాబు సంగతి కూడా రాబోయే రోజుల్లో ప్రజలు తేలుస్తారన్నారు. ఎవరికీ భయపడకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని సిపిఎం శ్రేణులకు సూచించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఒక రకంగా అధికారం వచ్చాక మరో రకంగా పాలకుల వ్యవహారం ఉంటోందన్నారు. టిడిపి కూటమి పేరుతో రాష్ట్రంలో బిజెపికి బీజం వేశారని, దాని పర్యవసానాలు ఇప్పటికే కనపడుతున్నాయని వివరించారు. మద్యం ఏరులై పారుతోందని, కాలేజీ, స్కూల్ పిల్లలకు మాదకద్రవ్యాలు అలవాటు చేస్తున్నారని విమర్శించారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు సలాం ఖాన్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ఆస్తులను దోచుకునే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలిస్తే దేశం ఎప్పుడూ అభివృద్ధి చెందదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.నాగరాజు, వి.ఏసురత్నం, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం రాయల్ ఫ్యాలెస్ ఫంక్షన్ హాల్లో సీతారాం ఏచూరి ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ పతాకావిష్కరణ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఏసురత్నం సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఉపాధి కార్మికులకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.

పరిష్కారం కాని భూ సమస్య

- తహశీల్దార్ ఎదుట మాజీ సైనికుడు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాజీ సైనికుడు రామచంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా, అధికారుల కాళ్లా వెళ్లా పడిన ఆ మాజీ సైనికుడికి న్యాయం జరగలేదు. దీంతో, తహశీల్దార్ ఎదుటే గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, భువనేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న ఆర్.రామచంద్ర(63) 1983లో సైన్యంలో చేరి 2005లో రిటైర్ అయ్యారు. మదనపల్లి మండలం, వెంకప్పకోట గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 89లో 2.30 ఎకరాల భూమిని రామచంద్రకు ప్రభుత్వం కేటాయించి పట్టా, పాసుబుక్కులు ఇచ్చింది. ఆ భూమిని కొన్నాళ్లపాటు సాగు చేశారు. 2020లో పక్షవాతం రావడంతో వైద్య చికిత్సలు చేయించుకుంటూ ఇంటిపట్టునే ఉన్నాడే. 2023 మార్చిలో ఆన్‌లైన్ నుంచి భూమిని తప్పించి, వన్ బి లేకుండా చేశారు. చదును చేసేందుకు భూమి వద్దకు వెళ్లిన మాజీ సైనికుడిని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సిఎంఒ పేషీకి వెళ్లి మొరపెట్టుకున్నాడు. మాజీ సైనికుడికి ఇచ్చిన భూమిని తిరిగి అతనికి అప్పగించాలని, స్కెచ్ ఇచ్చి, ఆన్‌లైన్‌లో తిరిగి చేర్చాలని సిఎంఒ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అప్పటి నుంచి సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. సోమవారం మదనపల్లె తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ ఖాజాబీని దీనిపై నిలదీశారు. తన పని జరగందే ఇక్కడి నుంచి వెళ్లనని, చావనైనా చస్తానని రామచంద్ర తెగేసి చెప్పాడు. దీంతో పోలీసులకు తహశీల్దార్ సమాచారమిచ్చారు. పోలీసులు తహశీల్దారు కార్యాలయానికి చేరుకోవడంతో.. తన పని చేయకపోగా పోలీసులను పిలిపిస్తారా అని వెంట తెచ్చుకున్న బ్లేడు, కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై తహశీల్దారు ఖాజాబీని వివరణ కోరగా, 2023లో భూమి సర్వే చేసినప్పుడు భూమి ఎవరైతే చూపించారో వారి వివరాల మాత్రమే ఆన్‌లైన్‌లో చేర్చామన్నారు. ఆ సమయంలో రామచంద్ర అందుబాటులో లేకపోవడంతో ఆ భూమిని బ్లాక్ లిస్టులో పెట్టామని తెలిపారు. మాజీ సైనికుడి పెట్టుకున్న అర్జీ ప్రకారం తిరిగి ఆ భూమిని ఇప్పించడానికి లేదా మరో ప్రత్యామ్నాయ మార్గం చూపడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ లోపే ఆయన కార్యాలయానికి వచ్చి ఇలా చేశారని వివరించారు.

విచారణకు హాజరైన కడప ఎంపి పిఎ

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి కడప సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో విచారణకు సోమవారం హాజరయ్యారు. ఆయనకు ఇటీవల పోలీసులు 41ఎ నోటీసులు ఇచ్చారు. వైసిపి సామాజిక కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి కేసులో రాఘవరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సోషల్ మీడియాలో వైఎస్.సునీత, వైఎస్.షర్మిల, వైఎస్.విజయమ్మపై అనుచిత పోస్టుల వ్యవహారంపై గత నెలలో రాఘవరెడ్డి ఇంటికి పోలీసులు నోటీసులు అంటించారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును రాఘవరెడ్డి ఆశ్రయించారు. డిసెంబరు 12 వరకు ఆయనపై ఎలాంటి తీవ్ర చర్యలూ తీసుకోవద్దని హైకోర్టు సూచించింది. సోమవారం రాఘవరెడ్డి పులివెందులకు రావడంతో పోలీసులు నోటీసులిచ్చారు. రాఘవరెడ్డిని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ విచారించారు.

త్వరలో అన్నదాత సుఖీభవ

- ఐదేళ్లలో సాగునీటికి పైసా ఖర్చు చేయలేదు :మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.ఆరు వేలుతో కలిపి వైసిపి ప్రభుత్వం రైతు భరోసాగా చెల్లించిందని, కానీ టిడిపి ప్రభుత్వం కేంద్ర ఇచ్చిన రూ.ఆరువేలతో కలిపి రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు చెల్లిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు. త్వరలో ఈ డబ్బులు రైతులకు జమ చేస్తామని చెప్పారు.రాష్ట్రంలో వ్యవసాయాన్ని ఉరి తీసిన జగన్ మోహన్‌రెడ్డికి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా డిఆర్‌సి సమావేశానికి హాజరైన ఆయన, అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు పాపం మాజీ సిఎం జగన్‌దేనని చెప్పారు. మూడేళ్ల వరకు విద్యుత్ ఛార్జీలు పెంచుకోవచ్చునని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు జగన్ ప్రభుత్వం అధికారాన్ని ఇచ్చిందని, దాన్ని రద్దు చేసే అధికారం టిడిపి ప్రభుత్వానికి లేదన్నారు. ఈనెల 15న రైతు సమస్యలపై అన్ని మండలాల్లో వినతులు అందజేయాలని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు ఏం చేశారని రోడ్డు మీదకు వస్తారని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని విమర్శించారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు మంజూరు చేయలేదని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల బిల్లులు సకాలంలో చెల్లించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1600 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించామన్నారు. ఇప్పుడు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన బిల్లులు 24 గంటల్లో చెల్లిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క రోడ్డు పని కూడా చేయలేదని, చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయలేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల మరమ్మతు పనులకు రూ.860 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పిల్లలకు విద్యను దూరం చేసి బడులు మూసివేసిందని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే బి.విజయచంద్ర పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం నిరవధిక పోరాటాలు

- కడప కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల నిరసన



చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు కోసం నిరవధిక పోరాటాలు సాగిస్తామని విద్యార్థి, యువజన సంఘం నాయకులు తెలిపారు. కడప ఉక్కుపై పార్లమెంటులో కేంద్ర ఉక్కు మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం కడప కలెక్టరేట్ వద్ద చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్, రాహుల్, రవి మాట్లాడారు. కడప ఉక్కును టెంకాయల పరిశ్రమగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదన్నారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలలో భారీ ఉక్కు పరిశ్రమ చాలా అవసరమని తెలిపారు. గడిచిన పదేళ్లల్లో కడప ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని వివరించారు. వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని తెలిపారు. రాష్ట్రంలోని ఎంపిలు పార్లమెంటులో కడప ఉక్కుపైన మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు.

గతంలో వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం కానీ కేంద్రాన్ని ఎదిరించి కడప ఉక్కుకు నిధులు రాబట్టలేకపోయిందన్నారు. తమ పోరాటాలలో భాగస్వామ్యం కావాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిస్తున్నామన్నారు. కడప ఉక్కు కోసం రాబోవు రోజులలో నిరవధిక ఉద్యమాలు సాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, ఉపాధ్యక్షులు నరసింహులు, ఉదయ్, వంశీ, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, అభినయ్, నిత్యా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



కొత్తూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ

- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, మందస

మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలివ్వాలని, పట్టాదారులకు పెట్టుబడి సాయం, పిఎం కిసాన్ నిధి ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, మందస మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాల పునర్విభజన అనంతరం సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోయిందని, దీంతో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. 50 శాతానికి మించి జనాభా గల గిరిజన పంచాయతీలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజన పంచాయతీలకు 1/70 చట్టం అమలు చేయాలని, సాగునీరు కోసం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని, రోడ్లు, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు నిర్మించాలన్నారు. దళారుల బారిన పడకుండా గిరిజనులు పండించిన పంటలను ఐటిడిఎ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు పి.ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ధర్మారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌వి యూనివర్సిటీలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల ప్రదర్శన

బజరంగ్‌దళ్ గూండాలను అరెస్టు చేయాలి

- ఎస్‌వి యూనివర్సిటీలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ చంగయ్యపై దాడి చేసిన బజరంగ్‌దళ్ గూండాలను అరెస్టు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎడి బిల్డింగ్ వరకూ ప్రదర్శనగా వెళ్లారు. అక్కడే ధర్నా నిర్వహించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ఆచార్య అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో దారుణం జరిగి వారం రోజులు గడిచినా గూండాలను పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. గూండాలకు బిజెపి నాయకులు మద్దతుగా నిలబడి, ప్రొఫెసర్‌పైనే ఎదురు కేసు నమోదు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీలో అధ్యాపకులకు, విద్యార్థులకు, సిబ్బందికి ఏమాత్రం రక్షణ ఉందో ఈ ఘటనను బట్టే అర్థమవుతుందని తెలిపారు. దాడికి పాల్పడిన బజరంగ్‌దళ్ నాయకులను హరేరామ హరేకృష్ణ గుడిలో సన్మానించిన రామదాసుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే యూనివర్సిటీలో చదివిన ముఖ్యమంత్రి, ఈ ఘటనపై స్పందించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు స్పందించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైస్‌ఛాన్సలర్ స్పందిస్తూ.. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకపోవడం అన్యాయమని, ఎస్‌పికి లేఖ రాసి అరెస్టు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ.. మతోన్మాదుల అరాచకాలకు హద్దూపద్దు లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులను సమీకరించి పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప మాట్లాడుతూ.. మతోన్మాదులకు పోలీసులు మద్దతిస్తున్నట్లుగా ఈ ఘటన సూచిస్తోందన్నారు. అనంతరం తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ.. విచారించి దోషులను అరెస్టు చేస్తామని, ఇప్పటికే కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ ఛైర్మన్ పరమశివన్, టిటిడి ఉద్యోగ సంఘ నాయకులు ప్రసాదరావు, అధ్యాపకులు గోపి, విసికె నాయకులు రమేష్, బిఎస్‌పి నాయకులు విజయ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సిపిఎం నగర కార్యదర్శి వేణు, ఎన్ .మాధవ్, సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆర్ లక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, డాక్టర్ సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, బి.రవి, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు సదా, దళిత నాయకులు శివరాజ్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ శ్రీనివాసులు, సాహితీ స్రవంతి నాయకులు ఓ వెంకటరమణ, బుజ్జి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దోపిడీ నియంత్రణకు ప్రత్యేక గుర్తింపు కార్డు

- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ కార్డు అనేది అన్ని సంక్షేమ పథకాలకు ఏకైక అర్హత అనే విధానానికి స్వస్తి పలికి ఏ పథకానికి సంబంధించిన గుర్తింపు కార్డును ఆ శాఖ ద్వారానే జారీ చేయడం ద్వారా రేషన్ బియ్యం దోపిడీని నియంత్రించవచ్చని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేషన్ బియ్యం పంపిణీలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందన్నారు. పిడిఎస్ బియ్యం దుర్వినియోగంపై రాష్ట్రప్రభుత్వం నియమించిన సిట్.. బియ్యం దోపిడీ ముఠా ఆట కట్టిస్తుందన్నారు. కాకినాడ పోర్టులో కూలీలకు పని కల్పించడమంటే అవినీతి బియ్యం వ్యాపారంతో కాదని, సక్రమమైన ఎగుమతులు, దిగుమతుల వ్యాపారంతో అనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. 2019-24 మధ్య పేదలకు అందాల్సిన రూ.80 వేల కోట్ల ఉచిత బియ్యంలో అగ్రస్థానం అవినీతిపరులకు ఆదాయ మార్గంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత బియ్యం కోసం సంవత్సరానికి సగటున రూ.16 వేలకోట్లు వెచ్చిస్తున్నా నిధులు దుర్వినియోగం కావడం బాధాకరమన్నారు. ప్రస్తుతం దాదాపు రూ.10 వేలకోట్లు కేంద్రం, రూ.6 వేలకోట్లు రాష్ట్ర ప్రభుత్వం బియ్యానికి ఖర్చు చేస్తున్నాయన్నారు.

ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ప్రాంతంలో పెద్దపులి సంచారం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం సబ్‌ప్లాన్ గిరిజన ప్రాంతంలో పెద్దపులి సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నెల 7న బాపన్నదారకు సమీపంలోని అటవీ ప్రాంతంలో దూడను చంపి ఓ అడవి జంతువు తిన్న ప్రదేశాన్ని జిల్లా అటవీశాఖ అధికారి డి రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె దుర్గారాంప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం జాన్సన్ పరిశీలించారు. నాలుగు ట్రాప్ కెమెరాలు అమర్చారు. ఆది, సోమవారాల్లో ట్రాప్ కెమెరాలను పరిశీలించగా పులి జాడ కనిపించలేదు. ఆ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలను అటవీశాఖ సిబ్బంది సోమవారం గుర్తించారు. వారం రోజులుగా ఎఎస్ఆర్ జిల్లా రాజవొమ్మంగిలో సంచరిస్తూ ఏలేశ్వరం క్షేత్ర పరిధిలోనికి వచ్చినట్లుగా అనుమానిస్తున్నారు.

సంపాదకీయం


వేటాడే ధర్మం

తమ విద్వేష ఎజెండా అమలుకు, ఉన్మాద చర్యలకు అడ్డొచ్చిన వారిని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ఏ విధంగా కక్షకట్టి వేటాడి వెంబడించి చిత్రవధలకు గురి చేస్తాయో గుజరాత్ మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ ఉదంతం తిరుగులేని ఉదాహరణ. ఆలిండియా సర్వీస్ పోలీస్ అధికారికే ఇంతటి ఘోర అనుభవం ఎదురైందంటే, ఇక సాధారణ వ్యక్తుల పరిస్థితేంటో తలచుకుంటే భయం కలుగుతుంది. దాదాపు 27 సంవత్సరాల నాడు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిని నేరం ఒప్పుకోవాలని ప్రమాదకర ఆయుధాలతో, కరెంట్ షాక్‌లతో టార్చర్ పెట్టారన్న కేసులో సంజీవ్ భట్‌ను నిర్దోషిగా గుజరాత్‌లోని పోర్‌బందర్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం నిర్దోషిగా ప్రకటించింది. ప్రాసిక్యూషన్ సందేహింపజాలని సాక్ష్యాధారాలు చూపలేకపోయిందని, ఒక ప్రభుత్వ అధికారి ప్రాసిక్యూషన్‌కు సరైన అనుమతి తీసుకోలేదని కోర్టు తప్పుబట్టింది. కాగా రెండున్నర దశాబ్దాలకుపైన తనపై నమోదైన అభియోగాలు తప్పుడువని నిరూపించుకోడానికి పోలీస్ అధికారి భట్ పడ్డ వ్యయప్రయాసలు, ఎదుర్కొన్న మానసిక వ్యథ మాటల్లో చెప్పలేం. ఇక్కడితోనే న్యాయ పోరాటం ఆగిపోయిందని కాదు. భట్ పూర్తిగా బయట పడ్డారనుకోడానికి వీల్లేదు.

ఎంతటి వారినైనా బిజెపి ఏ రకంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తుందో భట్ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే అర్థమవుతుంది. 1994లో ఆర్‌డిఎక్స్, ఇతర భయంకర అక్రమ ఆయుధాల ల్యాండింగ్‌పై పోలీసులు 22 మందిపై టాడా కేసు పెట్టి అరెస్ట్ చేశారు. అహ్మదాబాద్ సబర్మతి జైలులో ఉన్న నరన్ జాదవ్, ఇతర నిందితులను 1997లో పి.టి. వారెంట్‌పై పోర్‌బందర్‌కు విచారణకై తరలించారు. అక్కడ పోలీస్ కస్టడీలో నేరం ఒప్పుకోవాలంటూ ఎస్‌పిగా ఉన్న భట్, కానిస్టేబుల్ వాజుభాయి చౌ తమను టార్చర్ చేశారని నిందితుడు నరన్ జాదవ్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశాడు. కొన్నేళ్ల విచారణ అనంతరం 2013లో భట్, చౌలపై ఎఫ్ఐఆర్ నమోదుకు మేజిస్ట్రేట్ ఆదేశించారు. తీర్పు వచ్చే లోపు కానిస్టేబుల్ చౌ చనిపోయాడు. ఉగ్రవాద నిరోధక చట్టం టాడా కేసులోని నిందితుడి ఫిర్యాదుపై ఇన్నేళ్లు ఒక ఐపిఎస్ అధికారిపై కేసు నడవడం స్థానిక బిజెపి ప్రభుత్వ ప్రోద్బలం లేకుండా అసంభవం. 61 సంవత్సరాల మాజీ ఐపిఎస్ మరో రెండు కేసుల్లో శిక్ష పడి రాజ్‌కోట్ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. ఇవి కూడా బిజెపి వెనుకుండి బనాయించిన కేసులే కావడం గమనార్హం.

సంజీవ్ భట్‌పై బిజెపికి ఎందుకంత కక్షనో అర్థం కావాలంటే కాస్త వెనక్కి వెళ్లాలి. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం 1990లో ఎల్‌కె అద్వానీ చేపట్టిన దేశ వ్యాప్త రథయాత్రను నిలిపేశాక గుజరాత్‌లో పెద్ద ఎత్తున మత అల్లర్లు రేగాయి. జామ్‌జోథ్‌పూర్ పట్టణంలో బంద్‌లో ఘర్షణలు సృష్టిస్తున్న 150 మందిని పోలీస్ అధికారిగా ఉన్న భట్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విడిచిపెట్టాక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయారు. దాన్ని లాకప్ మరణంగా చిత్రీకరించడంతో ఆ కేసులో భట్ జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఒక లాయర్‌ను డ్రగ్స్ కేసులో 1996లో ఇరికించిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2002లో గుజరాత్ మత అల్లర్ల విషయంలో అబద్ధపు సాక్ష్యాలు సృష్టించారన్న కేసులో సామాజిక ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్, నాటి డిజిపి శ్రీకుమార్‌తో పాటు భట్ కూడా నిందితుడు. అన్నింటికీ మించి 2002లో గోద్రా అనంతర మారణకాండకు అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ ప్రమేయం ఉందని భట్ అఫిడవిట్ ఇవ్వగా సిట్ తోసిపుచ్చింది. ఈ కార్పణ్యంతోనే భట్‌ను ఏవో సాకులు చెప్పి సర్వీస్ నుంచి 2015లో గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేయగా, కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఏకంగా సర్వీస్ నుంచి తొలగించింది. న్యాయం కోసం భట్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. బిజెపి, మోడీ కక్ష కడితే ఇలా ఉంటుందని భట్ జీవితం ద్వారా తెలుస్తుంది. పైశాచికంగా సామూహిక అత్యాచారానికి గురై, కుటుంబాన్ని కోల్పోయిన బిల్కిస్‌బానో కేసులో శిక్ష అనుభవిస్తున్న ముద్దాయిలకు చట్టం, రాజ్యాంగం, కోర్టులను కాలరాసి క్షమాభిక్ష పెట్టగలరు. భీమాకొరేగావ్ వంటి కేసుల్లో అక్రమంగా ఇరికించి ఏళ్లకు ఏళ్లు బెయిల్ రాకుండా అడ్డుకోనూగలరు. తమ దారికి రాని భట్ వంటి సిన్సియర్ అధికారులను వెంటాడి వేధిస్తారు. ఇదీ బిజెపి, మోడీ, సంఘ్ పరివారం ధర్మం, నీతి!


మంచిమాట



రైతు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి ఊరుకోడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తీసేస్తాడు. కలుపు తీయని యెడల మంచి పంట రాదని అతనికి తెలుసు. అలాగే మానవ సమాజంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన చాలదు. చెడు నిరోధించాలి.

- మహాత్మా గాంధీ

నయా ఉదారవాదం, అంతకు మునుపు కాలం





ప్రభాత్ పట్నాయక్

అన్ని విమర్శలూ మత విమర్శతో ప్రారంభం కావాలని మార్క్స్ ఒక సందర్భంలో అన్నాడు. అదే మాదిరిగా ఆర్థిక అంశాలకు సంబంధించి ప్రస్తుత కాలంలో విమర్శ జిడిపితో మొదలు కావాలి. జిడిపి అనే భావనతో సహా, దానికి సంబంధించిన గణాంకాలు మొత్తం బూటకమే. ఆ ప్రాతిపదిక దోపిడీ అనే ఒక లక్షణాన్ని గుర్తించదు. ఉదాహరణకు: మొఘల్ చక్రవర్తి, అతడి అధికార గణం పొందే ఆదాయాన్ని దేశానికి వాళ్ళు అందించిన సేవలకు ప్రతిఫలం అని జిడిపి అంటుంది. వాళ్ళు పొందే మొత్తాన్ని దేశపు మొత్తం చేసిన ఉత్పత్తికి అదనంగా కలిపి జిడిపిని లెక్కిస్తుంది. నిజానికి అది దేశ ఉత్పత్తి నుండి ఆ మొఘల్ చక్రవర్తి, తదితరులు చేజిక్కించుకున్న భాగమే. కాని దానిని కూడా ఉత్పత్తిలో భాగం అని లెక్కించడం ద్వారా రెండింతలుగా చూపిస్తుంది. ఇది తప్పు. కాని నయా ఉదారవాద సమర్థకులు ఆ విధంగానే లెక్కించి ఆ కాలం చాలా గొప్పగా అభివృద్ధి చెందినట్టు చిత్రిస్తారు.

అదే విధంగా నయా ఉదారవాద విధానాలకు పూర్వం ఉనికిలో ఉండిన (ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచిన) కాలంలో కన్నా నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి రేటు చాలా ఎక్కువగా ఉందని, అంతకు పూర్వపు కాలంలోని 40 ఏళ్ళలో భారతదేశ ఆర్థిక పురోగమనం చాలా మందకొడిగా సాగిందని చెప్తూ నయా ఉదారవాద విధానాల కాలంలోనే దేశాభివృద్ధి వేగం పుంజుకున్నట్టు చెప్పుకుంటారు.

ఒకానొక కాన్ఫరెన్సులో నేను, నా సహచరుడు సంయుక్తంగా సమర్పించిన పత్రాన్ని విమర్శిస్తూ ఐఎంఎఫ్ డైరక్టర్ ఇదే విధంగా నయా ఉదారవాద కాలంలోనే మన దేశ ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందంటూ వ్యాఖ్యానించాడు. అయితే ఆ సందర్భంలో ఆయన జిడిపి గురించి ప్రస్తావించలేదు. 1960, 70 దశకాల్లో మన దేశంలో ఎక్కడ చూసినా ఎంతసేపూ అంబాసిడర్ కార్లు లేదా ఫియట్ కార్లు మాత్రమే కనిపించేవని, అదే నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చాక చాలా స్టైలిష్‌గా ఉంటూ వేగంగా దూసుకుపోయే కార్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఒక పేరున్న ఆర్థికవేత్త అయినప్పటికీ, ఆ ఐఎంఎఫ్ డైరక్టర్ సాంఘిక సంక్షేమం అంటే ఏమిటో అర్థం చేసుకోలేకపోయాడని నాకర్థమైంది.

అయితే జిడిపి ప్రమాణాన్ని సమర్థించే వాదనలను అంత తేలికగా తీసిపారేయకూడదు. ఉత్పత్తి అయిన సంపద ఏ విధంగా పంపిణీ ఔతోందన్న అంశాన్ని కాని, సాంఘిక సంక్షేమం ఎలా అమలౌతోందన్న అంశాన్ని కాని జిడిపి సూచించదు. అందుచేత కేవలం జిడిపి నే కొలబద్దగా తీసుకుని నయా ఉదారవాద విధానాలు మెరుగైనవా లేక వాటికన్నా అంతకు మునుపు అమలు జరిగిన విధానాలే కాస్త నయమా అన్నది నిర్ధారించకూడదని నా అభిప్రాయం. నయా ఉదారవాద కాలంలో ఆదాయాల్లో అసమానతలు తగ్గకపోగా మరింత పెరిగాయని, దిగువ స్థాయి ప్రజల పరిస్థితులు మరింత దిగజారాయని మనకి ఇప్పటికే స్పష్టంగా తెలుసు. అందుచేత ఇక్కడ ప్రశ్న ఏమంటే నయా ఉదారవాద కాలంలో అత్యధిక ప్రజానీకం జీవన స్థితిగతులు అంతకు మునుపటి కాలంలో కన్నా మెరుగు పడ్డాయా లేక దిగజారాయా అన్నదే. నా అభిప్రాయం దిగజారాయనే. అంతేకాక, నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధిరేటు నమోదైనదానిని కూడా అతిగా చేసి చూపించారు. చాలా మంది పరిశోధకులు సైతం ఈ కాలంలో జిడిపి వృద్ధిరేటును అతిగా అంచనాలు వేశారని, అందుచేత ఆర్థిక వృద్ధి రేటును కూడా అతిగా అంచనా వేశారని వాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుడిగా పని చేసిన అరవింద్ సుబ్రమణియన్ వారిలో ఒకరు. 2011-12 నుంచి 2016-17 మధ్య కాలంలో భారతదేశపు వృద్ధి రేటు ప్రతీ ఏటా కనీసం 2.5 శాతం అదనంగా లెక్కించారని ఆయన అన్నారు. 2011-12లోనే జిడిపి అంచనాలకు కొత్త ప్రాతిపదికను ఉపయోగించడం మొదలుబెట్టారు. ఇప్పటిదాకా అదే ప్రాతిపదికను కొనసాగిస్తున్నారు. అందుచేత అంతకు ముందు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి రేటు వాస్తవానికి 1 శాతం లేదా 1.5 శాతానికి మించదు. మరోపక్క ఆదాయాలలో అసమానతలు నిస్సందేహంగా పెరిగిపోయాయి. అంటే సామాన్య ప్రజల ఆదాయాలలో పెరుగుదల ఏమీ లేదన్నట్టే. అందుచేత ఆ సామాన్య ప్రజల కోణం నుంచి చూసినప్పుడు నయా ఉదారవాద కాలం సాధించిన విజయం ఏమీ లేదు. పైగా పెరిగిన అసమానతలు దేశంలోని ప్రజాతంత్ర వ్యవస్థల్ని, సమానత్వ విలువల్ని దెబ్బ తీశాయి.

అంతేకాదు. ప్రజల జీవన పరిస్థితులు దిగజారిపోయాయన్న విషయాన్ని ధృవపరిచే ప్రత్యక్ష ఆధారాలు మన దగ్గర ఉన్నాయి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో (1900 తర్వాత) బ్రిటిష్ వారి పెత్తనంలో భారతదేశం ఉన్నప్పుడు తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. మనకు స్వతంత్రం వచ్చేనాటికి అది కాస్తా 137 కిలోలకు పడిపోయింది. వలస పాలన కొనసాగిన ఆ 50 సంవత్సరాల కాలంలో ఏకంగా 31 శాతం పడిపోయింది! నయా ఉదారవాద పండితులు ప్రస్తుతం తూర్పారబడుతున్న కాలంలో (అంటే ప్రభుత్వ నియంత్రణతో ఆర్థిక వ్యవస్థ 1960-1980 కాలం) ఇది 186.2 కిలోలకు పెరిగింది. ఇది తప్పకుండా గణనీయమైన పెరుగుదల. కాని 20వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాల నాటి స్థాయికి చేరలేదు. నయా ఉదారవాద విధానాలు అమలవడం తర్వాత 2008 వరకూ దీర్ఘకాలం పాటు తలసరి ఆహారధాన్యాల లభ్యత పడిపోతూ వచ్చింది. ఆ తర్వాత కొంత పెరిగి, 2019-20లో 183.14 కిలోలకు చేరింది. 1991 నాటి స్థాయిని 2020-21లో మాత్రమే దాటి 186.77 కిలోలకు చేరింది. 2021-22లో కాస్త పెరిగి 187.13 కిలోలకు చేరింది. ఆహారధాన్యాల లభ్యత అనేది అభివృద్ధిని మదింపు చేసే ఒక ముఖ్యమైన ప్రమాణం. ఆ ప్రమాణం రీత్యా చూస్తే ఎదుగూ బొదుగూ లేకుండా నయా ఉదారవాద కాలంలో స్తంభించిపోయింది. 2022-23లో కోవిడ్ సహాయం కింద తలా 5 కిలోలు అందించిన కారణంగా తలసరి ఆహారధాన్యాల లభ్యత మరికాస్త పెరిగింది. అయితే దీనిని వృద్ధికి సంకేతంగా పరిగణించలేం. ఎందుకంటే ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను కరగబెట్టి ప్రజలకు పంచారే తప్ప అదనపు ఉత్పత్తి ఏమీ సాధించలేదు.

ఇప్పటివరకూ మనం ఆహారధాన్యాల సగటు లభ్యత ఆధారంగానే చర్చించాం. అందులో ఏ యే తరగతులకు ఎంతెంత అందుతోంది అన్నది చూడాలి. ఒకపక్క ఆదాయాల్లో అసమానతలు పెరుగుతున్నప్పుడు అధికాదాయ వర్గాల్లో ఆహారధాన్యాల లభ్యత, వినియోగం పెరుగుతుంది. అదే విధంగా అల్పాదాయ వర్గాల్లో ఆ లభ్యత, వినియోగం తగ్గుతాయి. ఫలితంగా అల్పాదాయ వర్గాల ప్రజలకు పౌష్టికాహారం అందకుండా పోతుంది.

ఈ విషయాన్ని ధృవీకరించే ఆధారాలు ఉన్నాయి. 1970 దశకంలో అప్పటి ప్లానింగ్ కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో 2200 క్యాలరీలు, పట్టణ ప్రాంతాలలో 2100 క్యాలరీలు శక్తిని ఇచ్చే ఆహారాన్ని ప్రతీ ఒక్క వయోజనులూ పొందగలిగి వుండాలని కనీస ప్రమాణాన్ని నిర్ణయించారు. అంతకు తక్కువ మోతాదులో పొందుతున్న వారంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టే పరిగణించారు. 1973-74 లో గ్రామీణ ప్రాంతాలలో ఆ కనీస ప్రమాణం ప్రకారం ఆహారం పొందలేక పోతున్నవారు 56.4 శాతం ఉండేవారు. 1993-94 నాటికి వారు 58 శాతం అయ్యారు. అంటే నయా ఉదారవాద విధానాలు అమలు అవడానికి మునుపు గ్రామీణ పేదరికం స్థాయిలో పెద్దగా మార్పు లేదు. పేదరికం పెరగనూ లేదు, తగ్గనూ లేదు అని చెప్పవచ్చు.

దాని పూర్తి భిన్నంగా 1993-94 నుండి 2017-18 మధ్య కాలంలో కనీస స్థాయిలో పౌష్టికాహారాన్ని పొందలేకపోయినవారు గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం నుండి 80 శాతానికి పెరిగారు (2017-18 నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాలను మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. అందుచేత ఉజ్జాయింపుగానే లెక్కించాల్సి వచ్చింది)! పేదరికం పరిస్థితి ఎంత దిగజారిందంటే ఆ గణాంకాల్ని ప్రభుత్వం తొక్కిపట్టడమే కాకుండా, పేదరికపు కొలమానాలనే మార్చివేసి కొత్త పద్ధతిలో శాంపిల్ సర్వే మొదలుపెట్టింది. దీనిని బట్టి నయా ఉదారవాద కాలంలో జిడిపి ప్రమాణ సమర్థకులు చెప్తున్న దానికి భిన్నంగా గ్రామీణ పేదరికం పెరిగిపోయిందని స్పష్టమౌతోంది.

అయితే నయా ఉదారవాద సమర్థకులు దీనికి జవాబుగా ఒక వాదనను ముందుకు తెస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది తమ బిడ్డల్ని స్కూళ్ళకి పంపుతున్నారని, ఆధునిక వైద్య సౌకర్యాలు పొందగలుగుతన్నారని, సెల్ ఫోన్లను అందరూ వాడగలుగుతున్నారని, గ్రామీణుల జీవనశైలి మారిపోయిందని, ఆహారధాన్యాల కన్నా తక్కిన విషయాల మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారని, వారి అభిరుచులు మారిపోయాయని అంటూ, ఈ కారణాల వలన వారు తీసుకునే పౌష్టికాహారపు క్యాలరీల విలువ తగ్గిపోయిందని అంటున్నారు. దానిని బట్టి వారి పేదరికం పెరిగిపోయిందని నిర్ధారించకూడదంటున్నారు.

వాళ్ళు ఇక్కడ విస్మరిస్తున్న అంశం ఒకటుంది. ప్రజలు వినియోగించే పలు రకాల సరుకుల్లో కొన్ని రకాల సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం సాధ్యపడదు. మరికొన్ని సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం వలన వారికి వెనువెంటనే ఇబ్బందులు రానప్పుడు అటువంటి సరుకుల వినియోగాన్ని వారు తగ్గించుకుంటారు. ఆహారధాన్యాలు ఈ రెండో కోవకు చెందుతాయి. వాటి వినియోగాన్ని తగ్గించుకుంటే వెనువెంటనే ఇబ్బందులు తలెత్తకపోవచ్చు కాని దీర్ఘకాలంలో నష్టం కలుగుతుంది. ఒక ఆపరేషన్ అవసరమైనప్పుడో లేదా క్యాన్సర్ లాంటి రోగం సోకినప్పుడో చేయవలసిన ఖర్చు తగ్గించనూ లేరు, వాయిదా వేయనూలేరు. ఇటువంటి అనుకోని ఖర్చులు వస్తూనే వుంటాయి. అదే విధంగా సాంకేతిక పురోగతి కారణంగా కొన్ని కొత్త రకాల సరుకుల వినియోగం మొదలౌతుంది. కొన్ని పాత రకపు సరుకుల వినియోగం నిలిచిపోతుంది.

ప్రమాదకరమైన రోగం సోకినప్పుడు ఒక వ్యక్తి తన గ్రామంలో ఉండే భూతవైద్యుడి మీద ఆధారపడలేడు. ఆధునిక వైద్యాన్ని ఆశ్రయించక తప్పదు. ఆ సందర్భంలో రోజువారీ ఆహారం మీద పెట్టే ఖర్చు తగ్గించుకోవడం అనివార్యం. అతడు ఆధునిక వైద్యం మీద ఖర్చు చేయగలుగుతున్నాడు గనుక అతని ఆర్థిక స్థితి మెరుగుపడిందని నిర్ధారించలేం కదా. పైగా ఆధునిక వైద్యపు ఖర్చులు విచ్చలవిడిగా పెరిగిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇంగ్లండ్ చక్రవర్తి 7వ హెన్రీ ఒక గాయం అల్సర్‌గా మారి సెప్టిక్ అయినందువలన మరణించాడు. అప్పటికి యాంటీ బయాటిక్స్ ఇంకా కనుగొనలేదు. ఇప్పుడు ఒక సామాన్యుడు ఆ యాంటీ బయాటిక్స్‌ను వాడగలుగుతున్నాడు. కాబట్టి ఈ సామాన్యుడు ఆనాటి 7వ హెన్రీ చక్రవర్తి కన్నా మెరుగ్గా జీవిస్తున్నాడని ఎవరైనా అనగలరా? తన జీవితంలో ఎప్పటికప్పుడు మారుతూ వుంటే పరిస్థితులను బట్టి తన వినిమయాన్ని మార్చుకోవడం అనివార్యం. అయితే, ఆ క్రమంలో ఆహారధాన్యాల వంటి కనీస అవసరాల వినిమయాన్ని సైతం తగ్గించుకోవలసిన పరిస్థితి ఉందా? లేదా? అన్నదానిని బట్టి అతడి జీవన స్థాయి మెరుగు పడిందో లేదో నిర్ధారించగలం.

ఇలా నిర్ధారించే క్రమానికి ఆహారధాన్యాల లభ్యత అన్నది ఒక స్పష్టమైన ప్రమాణం. ఆ లభ్యత తగ్గుతోందీ అంటే సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడడం లేదనే లెక్క.

నయా ఉదారవాద విధానాలకు పూర్వపు కాలంలో సామాన్యుల జీవన స్థితిగతులు ఎంతో కొంత మెరుగుపడ్డాయి. ఒకవైపు వారికి ఆహారధాన్యాల లభ్యతా పెరిగింది. మరోవైపు ఆధునిక సరుకులను వారు పొందగలగడం కూడా పెరిగింది. అయితే ఇదేమీ చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పలేం. కాని, నయా ఉదారవాద కాలంలో మాత్రం పౌష్టికాహార లేమీ పెరిగిపోతోంది. జీవన పరిస్థితులూ దిగజారిపోతున్నాయి. జిడిపి గణాంకాలను చూపిస్తూ ఈ మౌలిక సత్యాన్ని మరుగుపరచలేరు.

(స్వేచ్ఛానుసరణ)


నయా ఉదారవాద విధానాలకు పూర్వపు కాలంలో సామాన్యుల జీవన స్థితిగతులు ఎంతో కొంత మెరుగుపడ్డాయి. ఒకవైపు వారికి ఆహారధాన్యాల లభ్యతా పెరిగింది. మరోవైపు ఆధునిక సరుకులను వారు పొందగలగడం కూడా పెరిగింది. అయితే ఇదేమీ చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పలేం. కాని, నయా ఉదారవాద కాలంలో మాత్రం పౌష్టికాహార లేమీ పెరిగిపోతోంది. జీవన పరిస్థితులూ దిగజారి పోతున్నాయి. జిడిపి గణాంకాలను చూపిస్తూ ఈ మౌలిక సత్యాన్ని మరుగుపరచలేరు.

1993-94 నుండి 2017-18 మధ్య కాలంలో కనీస స్థాయిలో పౌష్టికాహారాన్ని పొందలేకపోయినవారు గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం నుండి 80 శాతానికి పెరిగారు (2017-18 నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాలను మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. అందుచేత ఉజ్జాయింపుగానే లెక్కించాల్సి వచ్చింది)! పేదరికం పరిస్థితి ఎంత దిగజారిందంటే ఆ గణాంకాల్ని ప్రభుత్వం తొక్కిపట్టడమే కాకుండా, పేదరికపు కొలమానాలనే మార్చివేసి కొత్త పద్ధతిలో శాంపిల్ సర్వే మొదలుపెట్టింది. దీనిని బట్టి నయా ఉదారవాద కాలంలో జిడిపి ప్రమాణ సమర్థకులు చెప్తున్న దానికి భిన్నంగా గ్రామీణ పేదరికం పెరిగిపోయిందని స్పష్టమౌతోంది.

విశ్లేషణ

కేరళ ప్రజలకు అండగా నిలుద్దాం





వి. వెంకటేశ్వర్లు

నూరు శాతం అక్షరాస్యత, 77 ఏళ్ళ ఆయు: ప్రమాణం సాధించిన, మహిళా సాధికారత, విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన, స్థానిక సంస్థలకు విధులు, నిధులు వికేంద్రీకరించి సుపరిపాలన అందించడంలో దేశంలో అగ్ర స్థానంలో పయనిస్తున్న రాష్ట్రం కేరళ. సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం ప్రజానుకూల విధానాలను అమలు చేస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతో వివిధ రాష్ట్రాలపై మతోన్మాదాన్ని రుద్ది రాజకీయ పబ్బం గడపుకొనేందుకు పూనుకుంటున్న మనువాదులకు కేరళ వామపక్ష ప్రభుత్వం కొరకరాని కొయ్యగా ఉంది. అందుకే ఆ రాష్ట్రంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షగట్టి లక్ష కోట్లకు పైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా ఆ రాష్ట్ర అభివృద్ధిని అస్థిర పరిచేందుకు కుయుక్తులు పన్నుతున్నది. దేశాన్నే కలిచివేసిన వయనాడ్ వరదల్లో మరణించిన వారికి కేంద్రం పైసా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈ 11వ తేదీన దేశ వ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదుల నాయకత్వంలో జరుగుతున్న కేరళ సంఘీభావ కార్యక్రమానికి అన్ని తరగతుల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

1957లో భారతదేశంలోనే మొట్టమొదట కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన రాష్ట్రం కేరళ. ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో భూసంస్కరణలు అమలు చేసి 36 లక్షల మంది పేదలకు, కౌలురైతులకు భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టు ప్రభుత్వానిది. కమ్యూనిస్టు పాలనను ఓర్వలేని, భూస్వాముల తొత్తుగా ఉన్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ళు తిరగక ముందే వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేసింది. అయినా ప్రజలు తిప్పికొట్టి వామపక్ష ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకున్నారు. అందుకే నాటి నుండి నేటి వరకు కేరళలో కమ్యూనిస్టులు ఓడినా, గెలిచినా ప్రజల కోసం పనిచేస్తున్నారు. కేరళ గత 7 సంవత్సరాలుగా అన్ని రంగాల్లో పురోగమిస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తోంది.

స్థానిక సంస్థలకు అధికారాలు

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్‌లో 28 శాతం స్థానిక సంస్థల నిధులు కేటాయిస్తుంది. ఇవిగాక సాధారణ పరిపాలన కోసం రెవెన్యూ ఆదాయంలో 6.5 శాతం వాటా పంచాయతీలకు ఇస్తుంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా స్థానిక సంస్థలకు విధులు, నిధులు కేటాయించి గ్రామ పంచాయతీలను స్థానిక ప్రభుత్వ సచివాలయాలుగా మార్చివేసింది. అన్ని రాష్ట్రాలలో కనీసం తాగునీటికి, విద్యుత్ బల్బులకు నిధులు లేక కునారిల్లుతుంటే కేరళలో ప్రతి పంచాయతీకి కోట్లలో రాష్ట్ర బడ్జెట్ నుండి నిధులు సమకూరుతున్నాయి. ప్రతి పంచాయతీ ఆఫీస్‌లో 18 నుండి 20 మంది వరకు ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. మన రాష్ట్రంలోని ఆర్డీవో ఆఫీస్ స్థాయిలో అక్కడి పంచాయతీ కార్యాలయం ఉంటుంది. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు కేటాయించి సర్వ అధికారాలు ఇస్తున్నారు. అందుకే ఎక్కడా లేనంతగా మహిళా సాధికారత కేరళలో కన్పిస్తుంది.

ఒకనాడు ఆహార ధాన్యాల కొరత ఎదుర్కొన్న రాష్ట్రం కేరళ. పరిమితమైన భూమి, కొండకోనల్లో సుగంధ ద్రవ్యాలు, వాణిజ్య పంటలకే పరిమితమైన రాష్ట్రం నేడు ఆ రాష్ట్ర ప్రజలకు ఆహార ధాన్యాలు, కూరగాయలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నది. 2019లో ఎకరాకు 2,547 కేజీల వరి పండిస్తే నేడు 3,073కు పెరిగింది. కూరగాయలు 7.25 మెట్రిక్ టన్నుల నుండి 14.9 మెట్రిక్ టన్నులకు పెరిగింది. రైతాంగానికి ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీ సహాయం వల్లనే ఇది సాధ్యమైంది. నేడు వరికి రూ.2800 మద్దతు ధర ఇస్తుందంటే రైతుల పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల వామపక్ష ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. 2020-21లో ప్రపంచాన్నే వణికించిన కరోనా సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 2013లో ఆహార భద్రతా చట్టం అమలు చేసిన రాష్ట్రం కేరళ. 'అతిజీవనం కేరళీయం' పథకాన్ని ప్రవేశ పెట్టి 80 లక్షల కుటుంబాలకు 17 రకాల నిత్యావసర సరుకులు అందించి ప్రజల ప్రాణాలను కాపాడింది. ఆ రాష్ట్ర ప్రజలనే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వెళ్ళిన వారిని వలస కార్మికులు అనకుండా గెస్ట్ వర్కర్లుగా నామకరణం చేసి అందరికీ తమ ప్రజల మాదిరిగానే నిత్యావసర సరుకులు అందించి ఆదర్శంగా నిలిచింది.

ప్రజాసంక్షేమం

వ్యవసాయ కార్మికులకు, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తున్నది. గుజరాత్ మోడల్ అని చెప్తున్న బిజెపి పాలిత రాష్ట్రంలో సగటు వేతనం రూ.300 ఉంటే కేరళలో రూ.720 ఉంది. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా రైతు, కూలీల మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పరించింది. కూలీలు పని చేసిన రోజే రైతు దగ్గర డబ్బులు లేకపోతే పంచాయతీలే కూలీలకు వేతనాలు చెల్లిస్తాయి. రైతు తమ దగ్గర ఉన్నప్పుడు పంచాయతీకి చెల్లిస్తాడు. ప్రతి రైతు సంక్షేమ బోర్డుకి 10 నుంచి 15 రూపాయలు నిధి చెల్లించాలి. కూలీ రూ.2 చెల్లించాలి. ప్రభుత్వం తమ వాటా చెల్లిస్తుంది. ఈ డబ్బుతో వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం, 60 ఏళ్ళు దాటిన వారికి పెన్షన్ సంక్షేమ బోర్డు ద్వారా అందిస్తారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమ పాళ్లలో అమలు జరపడానికి 83 వేల కోట్లతో నవ కేరళ నిర్మాణాన్ని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టింది. సహకార రంగానికి పెట్టింది పేరైన కేరళలో స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించే ఉద్దేశంతో సహకార రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. లక్ష కోట్లతో కేరళ కోఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభించింది. గ్రామీణ పేదలకు వేల కోట్లు అప్పులు ఇస్తున్నారు. కాని ఈ వ్యవస్థను దెబ్బ తీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దేశంలో గుజరాత్ మోడల్ అని చెప్తున్న మోడీ ఆ రాష్ట్రంలో 10 వేల లోపు ఉద్యోగాలు ఇస్తే కేరళలో విజయన్ ప్రభుత్వం 3 లక్షల ఉద్యోగాలు కల్పించింది. మన దేశానికి కావాల్సింది కేరళ మోడల్.

లౌకికతత్వానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కేరళ మార్గదర్శకంగా నిలుస్తున్నది. కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే కేరళ ప్రజల మధ్య కలహాలు సృష్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఎన్ని కుట్రలు పన్నినా వారి ఆటలు సాగడం లేదు. గ్రామీణ భారతంలో అంటరానితనం విలయ తాండవం చేస్తుంటే కేరళ అందుకు భిన్నంగా దళితులను దేవాలయ పూజారులుగా నియమించి చరిత్ర సృష్టించింది. దళిత వ్యక్తిని దేవాదాయ శాఖ మంత్రిగా నియమించింది. ఇటువంటి రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుచుకునే కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

ప్రజలకు అంకితమై పని చేస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉంది. ఆ రాష్ట్రానికి సంఘీభావం తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రతిఘటనకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

/ వ్యాసకర్త వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 9490098980 /

లౌకికతత్వానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కేరళ మార్గదర్శకంగా నిలుస్తున్నది. కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే కేరళ ప్రజల మధ్య కలహాలు సృష్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఎన్ని కుట్రలు పన్నినా వాటి ఆటలు సాగడం లేదు. గ్రామీణ భారతంలో అంటరానితనం విలయ తాండవం చేస్తుంటే కేరళ అందుకు భిన్నంగా దళితులను దేవాలయ పూజారులుగా నియమించి చరిత్ర సృష్టించింది. దళిత వ్యక్తిని దేవాదాయ శాఖ మంత్రిగా నియమించింది. ఇటువంటి రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుచుకునే కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ప్రజలకు అంకితమై పని చేస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉంది. ఆ రాష్ట్రానికి సంఘీభావం తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలి

- జంతర్ మంతర్ వద్ద ఇండియా బ్లాక్ ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఏడాదిన్నర కాలంగా అల్లర్లతో అల్లాడుతున్న మణిపూర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి, సామరస్యం, సాధారణ పరిస్థితులు నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జంతర్ మంతర్ వద్ద ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యాన ధర్నా జరిగింది. అనంతరం తక్షణమే మణిపూర్‌లో పర్యటించాలని ప్రధాని మోడీకి ఇండియా బ్లాక్ నేతలు వినతిపత్రం సమర్పించారు. మణిపూర్‌లో హింసకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ప్రాణాలకు, ఆస్తులకు భద్రత లేకుండా పోయిందన్నారు. సుదీర్ఘంగా కర్ఫ్యూ, ఇంటర్నెట్ నిషేధం, ధరల పెరుగుదల, మందుల కొరత, జాతీయ రహదారుల దిగ్బంధనం, కిడ్నాప్‌లు ప్రజలను అభద్రతా స్థితిలోకి నెట్టాయని పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ అగ్నిగుండంగా మారడానికి అనుమతినిచ్చిన ముఖ్యమంత్రిని వెంటనే తప్పించాలన్నారు.

ఈ సందర్భంగా ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ.. ప్రజలను విభజించి పాలించే సూత్రంపై బిజెపి పనిచేస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు లేకుండా అక్కడి ప్రజలను హింసిస్తున్నారని అన్నారు. ప్రజలపై హింస మంచిది కాదని, మణిపూర్ కూడా ఇండియాలోనే భాగమని ప్రధాని తెలుసుకోవాలని సూచించారు. ఏడాదిన్నరగా అక్కడ అరాచకం జరుగుతుంటే, కేంద్ర ప్రభుత్వం ఏమీ జరగనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే మణిపూర్‌లో సాధారణ పరిస్థితులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఓక్రమ్ ఇబోబీ సింగ్, కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్, ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీం, రాజారామ్ సింగ్ కుష్వాహ, అంగోమ్‌చా బిమోల్, జ్యోతిమణి, శశి థరూర్, ఎన్‌కె ప్రేమచంద్రన్, రబీకుల్ హుస్సేన్, సలోంగ్ సంగ్మా, సుపోన్ మెరిన్ జమీర్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి శాంత క్షత్రిమయం, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, గిరిష్ చోదంకర్, కన్నయ్య కుమార్ (ఎఐసిసి ఇన్‌ఛార్జులు), మయూక్ బిశ్వాస్, ఆరిఫ్ సిద్ధిక్ (ఎస్‌ఎఫ్‌ఐ), వరుణ్ చౌదరి (ఎన్‌ఎస్‌యుఐ), ఉదయ్ చిబ్ (యూత్ కాంగ్రెస్) పాల్గొని మాట్లాడారు.



జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్



భారత్ నౌకాదళంలోకి ఐఎన్‌ఎస్ తుశీల్

న్యూఢిల్లీ : భారత నౌకాదళంలోకి స్టీల్త్ ఫ్రిగేట్ ఐఎన్‌ఎస్ తుశీల్ ప్రవేశించింది. రష్యాలోని కాలినిన్‌గ్రాడ్ నౌకాశ్రయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రష్యా అధికారులు ఈ యుద్ధనౌకను అప్పగించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ 'ఆత్మ నిర్భర్ భారత్'కు రష్యా సంపూర్ణ మద్దతు ఇవ్వడం రెండు దేశాల మధ్య వున్న స్నేహబంధానికి మరొక ముఖ్యమైన ఉదాహరణ' అని అన్నారు. ఐఎన్‌ఎస్ తుశీల్‌తో సహా అనేక నౌకల్లో మేడ్ ఇన్ ఇండియా కంటెంట్ నిరంతరం పెరుగుతుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్, కౌంటర్ టెర్రరిజం వంటి రంగాల్లో పరస్పర నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భారత్-రష్యాలు నూతన సహకార యుగంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. 2016 అక్టోబర్‌లో నాలుగు స్టీల్త్ ఫ్రిగేట్‌ల కోసం భారత్-రష్యాల మధ్య ఒప్పందం కుదిరింది. వీటిలో రెండు రష్యాలోనూ, రెండు భారత్‌లోనూ నిర్మిస్తారు. కోవిడ్, ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఈ ఒప్పందం అమల్లో జాప్యం జరిగింది.

బాబా సిద్దికి హత్య కేసులో 13 మందికి 16 వరకూ కస్టడీ

ముంబయి : ఎన్‌సిపి నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దికి హత్య కేసులో 13 మంది నిందితులకు ఈ నెల 16 వరకూ పోలీసు కస్టడీ విధిస్తూ ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిద్దికి హత్య కేసును ముంబయి క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రధాన నిందితుడు శివకుమార్ గౌతమ్ సహా 26 మందిని అరెస్టు చేసింది. వీరిపై మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (ఎంసిఒసిఎ)లోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరిలో 13 మందిని సోమవారం ఎంసిఒసిఎ కోర్టు ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. ఈ హత్య కేసులో ఆర్థిక కోణాలను గురించి కూడా విచారించాల్సిన అవసరం ఉందని, కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ నెల 16 వరకూ వారికి కోర్టు కస్టడీ విధించింది. ఈ కేసులో అరెస్టయిన మిగిలిన నిందితులు ఇప్పటికే జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 12వ తేదీ రాత్రి ముంబయిలోని బాంద్రా ప్రాంతంలో బాబా సిద్దికిని కాల్చి చంపారు.

రాజకీయ పార్టీలకూ 'పోష్' చట్టం

- సుప్రీంకోర్టులో పిటీషన్

న్యూఢిల్లీ : పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం (పోష్) చట్టాన్ని రాజకీయ పార్టీలకూ వర్తింపజేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ విషయంపై ముందుగా ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషన్‌దారులకు సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయవాది యోగమయ ఎంజి దాఖలు చేసిన ఈ పిటిషన్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహనలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా 'రాజకీయ పార్టీలకు యజమాని - ఉద్యోగి మధ్య సంబంధం లేనందున పోష్ చట్టాన్ని పాటించాల్సిన అవసరం లేదని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును' జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. రాజకీయ పార్టీలకు సంబంధించినంత వరకూ ఎన్నికల కమిషన్‌కు పూర్తి అధికారం ఉందని, ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించారు. ఒకవేళ పిటీషనర్ ఆందోళనను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోతే తగిన న్యాయఫోరమ్‌ను ఆశ్రయించాలని తెలిపారు.

ప్రధాని సమాధానం చెప్పాల్సిందే

- మోడీ-అదాని ఫేస్ మాస్కులతో ఎంపీల ఆందోళన
- రాహుల్ మాక్ ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదాని ముడుపుల వ్యవహారంపై ప్రధాని మోడీ సభకు వచ్చి సమాధానం చెప్పాలని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. వినూత్న రీతిలో మోడీ-అదాని ఫేస్ మాస్కులతో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఆందోళన చేపట్టారు. సోమవారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద చేపట్టిన ఈ ఆందోళనలో రాజ్యసభ, లోక్‌సభల ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, డిఎంకె ఎంపి టిఆర్ బాలు, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, శివసేన ఎంపి సంజయ్ రౌత్, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీల ఎంపిలు మోడీ - అదాని ఫేస్ మాస్కులు పట్టుకొని... 'అదాని-మోడీ భాయ్ భాయ్, మోడీ - ఆన్సర్ దే' నినాదాలు చేశారు. అనంతరం మోడీ, అదాని ఫేస్ మాస్కులు ధరించిన ఇద్దరు కాంగ్రెస్ ఎంపిలను రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేశారు. ఇందులో మాణిక్యం ఠాగూర్.. అదాని ముసుగు వేసుకోగా, శివాజీరావు అధల్ రావు పాటిల్.. మోడీ మాస్క్ వేసుకున్నారు. వీరిద్దరిని దాదాపు 69 సెకన్లపాటు రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ చేశారు. దీంట్లో 'ఆజ్ కల్ క్యా హెూ రహా హై భాయ్? (ఈ రోజుల్లో ఏమి జరుగుతోంది సోదరా)' అని అదాని మాస్కును రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు. ఇందుకు అదాని ఫేస్ మాస్క్ వేసుకున్న ఠాగూర్, మోడీ ఫేస్ మాస్క్‌తో ఉన్న పాటిల్‌పై చేయి వేసి... 'మెయిన్ జో భీ బోల్తా హన్, యే కర్తా హై. మెయిన్ కుచ్ భీ చహ్తా హన్, పోర్ట్ చాహియే, ఎయిర్‌పోర్ట్ చాహియే (నేను ఏది చెప్పినా, అతను చేస్తారు. నాకు ఏది కావాలంటే అది. ఎయిర్‌పోర్ట్ లేదా పోర్ట్)' అని బదులిస్తారు. మరోసారి రాహుల్ స్పందిస్తూ... 'మీరు తదుపరి ఏమి అడుగుతున్నారు?' అని అడగ్గా, 'సాయంత్రం మీటింగ్ ఉంది' అని ఠాగూర్ సమాధానం ఇస్తారు. అలాగే 'మేము ఒకేలా ఉన్నాం. మేము ప్రతిదీ కలిసి చేస్తాం. మేం చాలా ఏళ్లుగా కలిసి ఉన్నాం' అంటూ ఠాగూర్ అంటారు. కాగా ఇలాంటి ఇంటర్వ్యూలు రికార్డు చేసి, ప్రసారం చేయడం నిబంధనలకు విరుద్ధమని లోక్‌సభ అధికారులు తెలిపారు. కేవలం మీడియా స్టాండ్ వద్ద సభ్యులు మాట్లాడేందుకు స్పీకర్ అనుమతి ఇచ్చారని, కానీ చట్టసభ సభ్యులు మాక్ సెషన్‌ను రికార్డు చేయడం చట్ట విరుద్ధమైన చర్య అని అన్నారు.



మణిపూర్ హింసాకాండ

- ఆస్తుల దగ్ధం, లూటీ, ఆక్రమణల వివరాలు ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో గత ఏడాది మే నుంచి కొనసాగుతున్న హింసాకాండ నేపథ్యంలో పూర్తిగా, పాక్షికంగా దగ్ధమైన భవనాలు, లూటీలు, ఆక్రమణల గురించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. అక్రమంగా ఆస్తులను ఆక్రమించిన వారిపై తీసుకున్న క్రిమినల్ చర్యలు, యజమానులకు చెల్లించిన పరిహారం వంటి వివరాలను కూడా అందించాలని పేర్కొంది. హింసాకాండ కారణంగా నిరాశ్రయులైన ప్రజలు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటీషన్ తరుపున న్యాయవాదులు 'మణిపూర్‌లో హింసాకాండ అంతం కాలేదు. భారత ప్రభుత్వంపై అక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోయారు' అని తెలిపారు. 'అది మాకు తెలుసు' అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. మణిపూర్ తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పైన తెలిపిన ఆదేశాలను జారీ చేసింది. పూర్తి వివరాలను సీల్డు కవరులో అందించాలని సిజెఐ ఆదేశించగా, అందిస్తామని తుషార్ మెహతా తెలిపారు. ఇలాంటి పిటీషన్‌ను సుప్రీంకోర్టు విచారించనవసరం లేదని, కోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ ప్యానెల్ ముందు ఉంచవచ్చునని మెహతా అన్నారు. తదుపరి విచారణను 2025 జనవరి 20 నుంచి ప్రారంభమయ్యే వారానికి ధర్మాసనం జాబితా చేసింది.

రష్యాలో అసద్‌కు ఆశ్రయం

- స్పష్టం చేసిన క్రెమ్లిన్
- సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలి: చైనా

మాస్కో : సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అసద్‌కు రష్యా ఆశ్రయం కల్పించింది. అధ్యక్షుడు పుతిన్ స్వయంగా దీనికి ఆమోదం తెలిపారని క్రెమ్లిన్ (రష్యా అధ్యక్ష భవనం) ప్రకటించింది. రాజకీయ ఆశ్రయం కల్పించాలన్న అసద్ అభ్యర్థనకు రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ఆమోద ముద్ర వేశారని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ సోమవారం వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ నేతల మధ్య ఎలాంటి సమావేశం లేదని స్పష్టం చేశారు. అసద్ ఆచూకీ గురించి వివరాలు చెప్పేది కూడా ఏమీ లేదన్నారు. అసద్‌కు రాజకీయ ఆశ్రయం ఎలా లభించిందని ప్రశ్నించగా ఇటువంటి నిర్ణయాలు దేశాధినేత జోక్యం లేకుండా జరగవని, ఇది పుతిన్ సొంత నిర్ణయమని చెప్పారు.

సిరియాలోని రష్యా మిలటరీ స్థావరాల భవితవ్యం గురించి ప్రశ్నించగా దాని గురించి ఇప్పుడే మాట్లాడడం తొందరపాటు అవగలదని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. ఈ స్థావరాల గురించిన చర్చలు సిరియా కొత్త నేతలపై ఆధారపడి వుంటుందన్నారు. ప్రస్తుతం అక్కడ అస్థిరత నెలకొందన్నారు. సిరియాలో అకస్మాత్తుగా తలెత్తిన పరిణామాలు రష్యా సహా యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయన్నారు. ఎవరైతే అధికారంలో వున్నారో వారితో చర్చలు జరిపేందుకు ఇంకా సమయముందన్నారు. తమకు కూడా దేశంలోని దౌత్య కార్యాలయాలను అస్థిరపరిచే ఆలోచన లేదని సిరియా ప్రతిపక్ష బలగాలు స్పష్టం చేశాయి.



సాయుధ తిరుగుబాటు దళాల ఆక్రమణతో సిరియా నుండి పారిపోయిన అసద్ రష్యా చేరుకున్నారని వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ ప్రకటనతో ఒక స్పష్టత వచ్చింది. అసద్ ప్రభుత్వం కూలిపోయిన నేపథ్యంలో మాస్కోలోని సిరియన్ ఎంబసీపైన సిరియా ప్రతిపక్షం పతాకం ఎగిరింది. ఎంబసీ చుట్టూ పరిస్థితులు ప్రశాంతంగా వున్నాయని, అంతా సాధారణంగా సాగిపోతోందని మీడియా వ్యాఖ్యానించింది. స్పెయిన్, గ్రీస్, సెర్బియా, స్వీడన్‌లతో సహా పలు దేశాల్లో సిరియా ఎంబసీలపై కొత్త పతాకం రెపరెపలాడింది.

సిరియా సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి : చైనా

సిరియా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత గౌరవించాల్సిందేనని చైనా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సిరియాలో నెలకొన్న పరిస్థితులను అవకాశంగా తీసుకుని సిరియాలోని గొలాన్ హైట్స్‌ను ఆక్రమించడానికి ఇజ్రాయిల్ అవకాశం తీసుకుంది. డమాస్కస్‌లోని పలు లక్ష్యాలపై వైమానిక దాడులు జరిపింది. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ పై ప్రకటన చేశారు. సిరియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. సిరియా రాజకీయ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించాలని తేల్చి చెప్పారు. సోమవారం తెల్లవారు జామున రాజధాని డమాస్కస్‌లో దాడుల శబ్దాలు వినిపించాయని మీడియా వార్తలు తెలిపాయి.

పరిస్థితిని పరిశీలిస్తున్నాం : భారత్

సిరియాలో తిరుగుబాటుదారులు అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత అక్కడి పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు భారత్ తెలిపింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సిరియా ఐక్యత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయవలసిన అవసరాన్ని తాము ప్రస్తావిస్తున్నాం. సిరియా సమాజంలోని ప్రజలందరి ప్రయోజనాలను, ఆకాంక్షలను గౌరవించే శాంతియుత రాజకీయ వాతావరణం కోసం నిలబడతాము' అని ప్రకటనలో పేర్కొంది. సిరియాలోని భారతీయ పౌరులందరూ సురక్షితంగా ఉన్నారని ఆదివారం మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఆ వ్యాఖ్యలు ఆందోళనకరం

- అలహాబాద్ హైకోర్టు జడ్జి ప్రసంగంపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్
- భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ

న్యూఢిల్లీ : విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నిర్వహించిన ఒక కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)కి ఆమె లేఖ రాశారు. న్యాయ నిష్పాక్షికత, రాజ్యాంగ విలువల సూత్రాలను దెబ్బతీసేలా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఆ లేఖలో ఉటంకించారు. "న్యాయవ్యవస్థలోని సీనియర్ సభ్యులు, చేసిన బహిరంగ ప్రసంగం గురించి మీ దృష్టికి తీసుకురావటం నా బాధ్యతగా భావించి మీకు లేఖ రాసే స్వేచ్ఛను తీసుకుంటున్నానని బృందా కరత్ పేర్కొన్నారు. ఈ ప్రసంగం మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. దీనిని చాలా మంది చూశారు. చదివారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లోనూ స్పందించారు. దాని ప్రభావం... ఆయన మాట్లాడినప్పుడు హాజరైన కొన్ని వందల మంది కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల భారత ప్రధాన న్యాయమూర్తికి వాస్తవాలను తెలియజేయటం అత్యంతావశ్యకం. డిసెంబర్ 8న విహెచ్‌పి ఏర్పాటు చేసిన సమావేశానికి జస్టిస్ యాదవ్ హాజరయ్యారు. విహెచ్‌పి అధికారిక వెబ్‌సైట్ (విహెచ్‌పి.ఒఆర్‌జి).. 'విహెచ్‌పి లక్ష్యం హిందూ సమాజాన్ని నిర్వహించడం, రక్షించడం, దానికి సేవ చేయడం' అని తెలియజేస్తుంది. ఒక సెక్టేరియన్ సంస్థ కార్యక్రమానికి సీనియర్ న్యాయమూర్తి హాజరు కావడమనేది చాలా తీవ్రమైన అంశమని గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చే మొదటి విషయం.. న్యాయవ్యవస్థ ప్రవర్తనా నియమావళి. మతమార్పిడులు, యూనిఫాం సివిల్ కోడ్, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో పాటు పలు అంశాలపై చర్చించేందుకు విహెచ్‌పి సమావేశం జరిగింది. న్యాయవ్యవస్థ సభ్యులు... కోర్టుల్లో, చట్టసభల్లో చర్చిస్తున్న విషయాలపై బహిరంగంగా వ్యాఖ్యానించవచ్చా? అనేది రెండో అంశం.

మూడోది.. ముఖ్యంగా జస్టిస్ యాదవ్ చేసిన అసలు ప్రసంగం. నేను బార్ అండ్ బెంచ్ పోర్టల్ నుంచి తీసుకున్న ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను కింద ఇస్తున్నాను. నేను వివిధ వేదికలపై ప్రసంగపు అనేక భాగాలనూ విన్నాను. 'ఇది హిందుస్థాన్ అని చెప్పటానికి నాకు ఎలాంటి సంకోచమూ లేదు. ఈ దేశం ఇక్కడ నివసిస్తున్న మెజారిటీ కోరికల ప్రకారం నడుస్తుంది. ఇది చట్టం. ఇది హైకోర్టు న్యాయమూర్తిగా మాట్లాడటం కాదు. చట్టం బహుసంఖ్యాక్(మెజారిటీ)కు అనుగుణంగా పనిచేస్తుంది' అని యాదవ్ అన్నారు. 'మన దేశంలో, అన్ని జీవులను గౌరవించాలనీ, చిన్న జంతువులనూ గౌరవించాలనీ వాటికి హాని కలిగించకుండా ఉండాలని మనకు చిన్నప్పటి నుండి నేర్పించారు. అందుకే మనం మరింత సహనం, కరుణతో ఉంటాం. ఇతరులు బాధపడినప్పుడు బాధను అనుభవిస్తాము. కానీ ఇది అందరి విషయంలో కాదు. మన సంస్కృతిలో, పిల్లలను భగవంతుని వైపు నడిపించటం, వేద మంత్రాలు బోధించటం, అహింస విలువలతో పెంచుతాం. అయితే, కొన్ని ఇతర సంస్కృతులలో, పిల్లలు జంతువుల వధను చూస్తూ పెరుగుతారు. దీనితో, వారి నుంచి సహనం, కరుణను ఆశించటం కష్టమవుతుంది' అని యాదవ్ తెలిపారు" అంటూ కరత్ తన లేఖలో వివరించారు.



ఆయన చేసిన ప్రసంగంలోని అభ్యంతరకరమైన విషయాలను ఆమె లేవనెత్తారు. "గౌరవ ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు భారత రాజ్యాంగంపై ప్రమాణం చేస్తారు. ఈ ప్రసంగం (శేఖర్ యాదవ్ చేసిన ప్రసంగం) ఆ ప్రమాణాన్ని ఉల్లంఘించడమే. ఆయనది ద్వేషపూరిత ప్రసంగం. రాజ్యాంగంపై దాడి. లౌకిక, ప్రజాస్వామ్య దేశ సామూహిక మనస్సాక్షికి అవమానకరం. ఇది అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేత చేయబడటమూ న్యాయ ప్రక్రియపై దాడి. మైనారిటీ కమ్యూనిటీకి వ్యతిరేకంగా, మెజారిటీ దృక్పథానికి అనుకూలంగా పక్షపాతంతో, బహిరంగంగా వ్యక్తీకరించబడిన అభిప్రాయాన్ని ఒక సభ్యుడు కలిగి ఉన్న న్యాయస్థానంలో ఏ వ్యాజ్యకర్త కూడా న్యాయం కోసం ఆశించలేరు. అలాంటి సభ్యుడు ధర్మాసనానికి, న్యాయస్థానానికి, మొత్తం న్యాయ వ్యవస్థకే కళంకం తెస్తారు. న్యాయస్థానంలో అటువంటి వ్యక్తులకు చోటు ఉండదు, ఉండకూడదు. ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానం చర్య తీసుకుంటే.. దేశం కృతజ్ఞతతో ఉంటుందనటంలో సందేహం లేదు" అని బృందాకరత్ వివరించారు.

గోపిమూర్తి ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కాకినాడ జెఎన్‌టియుకె ఆవరణలో మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కి డబ్బులు పంచి, ప్రలోభాలకు గురిచేసి గెలుపు కోసం కొందరు కార్పొరేట్ వ్యక్తులు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారన్నారు. మెజారిటీ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిజాయితీ వైపే నిలిచి తనకు ఈ విజయాన్ని కట్టబెట్టారని పేర్కొన్నారు. భారీ మెజారిటీని అందించి ప్రజాస్వామ్య విలువలను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు..ఇప్పటికే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాల్లో పాల్గొన్నానని, భవిష్యత్తులో తనకు అప్పగించిన బాధ్యతతో సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని అన్నారు.

విజయోత్సవ ర్యాలీ

ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు జెఎన్‌టియుకె వద్దకు చేరుకున్నారు. పూలమాలలతో గోపిమూర్తికి ఘనంగా స్వాగతం పలికారు. జెఎన్‌టియుకె నుంచి భానుగుడి, కలెక్టరేట్ మీదుగా బైక్ ర్యాలీతో యుటిఎఫ్ హోమ్‌కు చేరుకున్నారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఇది అందరి విజయం : విజయోత్సవ సభలో వక్తలు

గోపిమూర్తి విజయం అందరి విజయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో విజయోత్సవ సభ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నారం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోపిమూర్తి విజయం కోసం యుటిఎఫ్‌తోపాటు అనేక ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు పని చేశాయన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ ఈ విజయంతో ఉపాధ్యాయుల నిజాయితీ మరోమారు రుజువైందని పేర్కొన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాణిక్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం పనిచేస్తున్నారన్నారు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గోపిమూర్తి విజయంతో యుటిఎఫ్‌కి మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. గోపిమూర్తి మాట్లాడుతూ ప్రత్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినప్పటికీ మెజారిటీ ఓటర్లు తన వైపు నిలబడి భారీ విజయాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తొలుత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేరళ పట్ల కేంద్రం అలసత్వాన్ని ఎత్తిచూపుతూ

11 నుండి 21వరకు దేశవ్యాప్తంగా ప్రచారం

- సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నిర్ణయం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కేరళ సంఘీభావ ప్రచారాన్ని ఈ నెల 11 నుండి 21వరకు సమిష్టిగా చేపట్టాలని సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నిర్ణయించాయి. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ప్రజానుకూల విజయాలు, ప్రత్యామ్నాయాలపై ఈ ప్రచారం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది. కేరళ ప్రభుత్వ రుణ పరిమితులను కుదించడం, సహకార సమాఖ్య వాదానికి ముప్పు వాటిల్లేలా చట్టబద్ధమైన ఆర్థిక కేటాయింపులను నిరాకరించడంతో సహా కేరళ ప్రజల హక్కులను అణచివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకుంటున్న కక్షసాధింపు చర్యలను ఈ ప్రచార సమయంలో ఎండగట్టనున్నారు. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఒక ప్రకటన విడుదల చేశారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన విపత్తు బాధితులకు సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోంది. ఈ విషాద ఘటనలో దాదాపు 400మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత విషాదం సంభవించినా ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న కేరళ ప్రభుత్వ అభ్యర్థనను కేంద్రం తిరస్కరిస్తోంది.

చెన్నమనేని రమేష్ జర్మనీ పౌరుడే

- తెలంగాణ హైకోర్టు
- రూ. 30 లక్షల జరిమాన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత చెన్నమనేని రమేశ్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. పౌరసత్వం కేసులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు సోమవారం తేల్చి చెప్పింది. జర్మనీ పౌరుడిగా ఉంటూ వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచారని, తప్పుడు డాక్యుమెంట్లతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అందుకుగాను చెన్నమనేని రమేష్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. నెలలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిలో రూ.25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, రూ.ఐదు లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. తప్పుడు సమాచారంతో ఎన్నికల్లో పోటీ చేశారంటూ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గతంలో చెన్నమనేని రమేశ్‌కు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. వాదోపవాదనల అనంతరం సిజె ధర్మాసనం సోమవారం తుదితీర్పు ప్రకటించింది.

జనవరి6 అల్లర్ల కేసులో దోషులకు క్షమాభిక్ష

- విచారణ అధికారులపై చర్యలు : ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే కేపిటల్ దాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న వారికి క్షమాభిక్ష ప్రసాదించి, విడుదల చేస్తానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎన్‌బిసి అనే వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం వారంతా నరకంలో ఉన్నారని అభివర్ణించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటానని, కొంతమంది జైలుకి కూడా వెళ్లాల్సి ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి తరువాత ట్రంప్ అధికారాన్ని బదిలీ చేయడానికి నిరాకరించారు. ఎన్నికల్లో భారీ ఎత్తున మోసాలు జరిగాయని ఆరోపించారు.

2021 జనవరి 6న వేలాది మంది ట్రంప్ మద్దతుదారులు అమెరికా పార్లమెంటు భవనం (కేపిటల్ హిల్) లోకి చొరబడ్డారు. అధ్యక్ష ఎన్నికల ధ్రువీకరణ ప్రక్రియకు అంతరాయం కలిగించారు. దీంతో వందలాదిమంది చట్టసభ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, వందలాది మంది పోలీసులు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించి మొత్తం 1,572 కేసులు నమోదయ్యాయి. వీరిలో 1,251 మందిని దోషులుగా నిర్ధారించి, అందులో సగం మందికి జైలు శిక్ష విధించారు.

ఉన్మాది ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌ఎఫ్‌ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ లహరిని హత్య చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

హోంమంత్రి ఆగ్రహం

ప్రేమించలేదనే కారణంతో ఇంటర్ విద్యార్థిని లహరిపై రాఘవేంద్ర అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర హోంమంత్రి అనిత ఆదేశించారు. ఉన్మాద చర్య పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో విద్యార్థిని మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నంద్యాల జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడానని, ఈ ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నానని, సంఘటనా స్థలాన్ని పరిశీలించాలని ఎస్‌పిని ఆదేశించానని పేర్కొన్నారు.

అదాని ముడుపులపై దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. 'నా మొత్తం రాజకీయ జీవితంలో ఇంత పక్షపాతంతో వ్యవహరించే ఛైర్మన్‌ను ఎప్పుడూ చూడలేదు. అతను (జగ్‌దీప్ ధన్‌ఖర్) మమ్మల్ని మాట్లాడనివ్వరు, కానీ వారందరిని (ప్రభుత్వం నుండి) మాట్లాడేలా అవకాశం ఇస్తారు' అని విమర్శించారు. పార్లమెంటును నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ విమర్శించారు. ఈ సమావేశాల సందర్భంగా ప్రధాని మోడీ కేవలం ఒక్కరోజే సభకు హాజరయ్యారని విమర్శించారు.

జమిలి ఎన్నికల బిల్లు పెట్టేందుకు ప్రభుత్వం యోచన

వన్ నేషన్ వన్ ఎలక్షన్ (జమిలి) బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో లేదా తదుపరి సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి ఉద్దేశించిన ఈ బిల్లుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సూచిస్తుంది. ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలని యోచిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

బంగ్లాదేశ్‌లో మైనార్టీలకు భద్రత కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేయడానికి సుముఖంగా లేకపోవడం చూస్తుంటే కేంద్రం అన్యాయమైన, అమానవీయమైన వైఖరి స్పష్టమవుతోంది. సంక్షోభ సమయాల్లో సయితం ఫెడరలిజం సూత్రాలను దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరించడం దారుణమని విమర్శించింది.

రాష్ట్ర ప్రభుత్వం కోరిన నిధులను తక్షణమే విడుదల చేయాలని పొలిట్‌బ్యూరో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

నోయిడా రైతుల పోరాటానికి మద్దతు

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో రైతులపై పోలీసుల అణచివేత చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), ఇతర సంఘాలకు చెందిన దాదాపు 150 మంది నేతలు, కార్యకర్తలు జైలు పాలయ్యారు. అరెస్టయిన రైతులు జైల్లో నిరాహార దీక్ష చేపట్టారు. ఇంకా అనేకమంది కార్యకర్తల గృహ నిర్బంధాలు కొనసాగుతున్నాయి. ఈ పోరాటం అగ్ర భాగాన వున్న మహిళలపై పోలీసులు దాడి చేయడం దిగ్భ్రాంతి కలిగించింది.

45 గ్రామాలకు చెందిన రైతులు ఈ గ్రేటర్ నోయిడా పోరాటం చేపట్టారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం గత కొంతకాలంగా వీరి భూములను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు తమకు అందే నష్టపరిహారం రేట్లను సవరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 1997లో కుదిరిన ఒప్పందం ప్రకారం రైతులకు ప్లాట్‌లను కేటాయించాలని కోరుతున్నారు. తప్పనిసరి ఉపాధి విధానం అమలు చేయడంతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఈ పోరాటానికి సిపిఎం పూర్తిగా మద్దతిస్తోంది. రైతులపై ఈ అణచివేత చర్యలు తక్షణమే ఆపాలని కోరుతోంది. రైతుల న్యాయమైన డిమాండ్లను తప్పనిసరిగా ఆమోదించి, అమలు చేయాలని కోరింది.

పార్టీ మహాసభ సన్నాహాలు

వచ్చే ఏడాది ఏప్రిల్ మొదటివారంలో జరగనున్న పార్టీ 24వ అఖిలభారత మహాసభలో చేపట్టనున్న ముసాయిదా రాజకీయ తీర్మానంపై పొలిట్‌బ్యూరో చర్చించింది. ఈ చర్చ ఆధారంగా కోల్‌కతాలో జనవరి 17-19 తేదీల్లో సమావేశమయ్యే కేంద్ర కమిటీ ముందు ఆమోదానికి ఉంచుతారు.

మంచి స్నేహం



ఒక ఊరిలో ప్రవళిక, వెన్నెల అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారిద్దరూ ఎప్పుడూ కలిసే పాఠశాలకు వెళ్లేవారు. టీచర్లు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదివేవారు. ఆటలు ఆడే సమయంలో ఎవరు గెలిచినా సంతోషపడేవారు. పరీక్షల్లో మార్కులు ఒకరికి ఎక్కువ, ఒకరికి తక్కువ వచ్చినా ఒకరినొకరు అభినందించుకునేవారు.

ఒకరోజు ఆ పాఠశాలకు నేహ వచ్చింది. తనతో ప్రవళికకు స్నేహం కుదిరింది. ఆ రోజు నుంచి వెన్నెలను పట్టించుకోవడం మానేసింది. పాఠాలు వినడం మానేసి నేహ, ప్రవళిక ముచ్చట్లు పెట్టేవారు. ఈసారి పరీక్షల్లో ప్రవళికకు మార్కులు బాగా తక్కువ వచ్చాయి.

స్నేహితురాలు చదువులో వెనకబడడం చూసి వెన్నెల చాలా బాధపడింది. ఒకరోజు ప్రవళిక వద్దకు వెళ్లి 'ప్రవళిక, నువ్వు టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడం లేదు. ముచ్చట్లు పెడుతూ కూర్చుంటున్నావు. అందుకే నీకు మార్కులు తక్కువగా వచ్చాయి. ఇకనైనా చదువుపై శ్రద్ధ పెట్టు. నేహని కూడా బాగా చదువుకోమని చెప్పు' అని చెప్పింది. అయినా వెన్నెల మాటలు ప్రవళిక వినిపించుకోలేదు.

రోజురోజుకీ నేహ, ప్రవళిక చదువులో బాగా వెనకబడిపోయారు. ఇలాగే ఉంటే స్నేహితురాలు తనకి దూరమవుతుందని వెన్నెల గ్రహించింది. ఒక రోజు నేహతో మాట్లాడాలని చెప్పి, ప్రవళిక ఇంటి దగ్గరికి తీసుకెళ్లింది. ఆ రోజు ప్రవళిక స్కూలుకి రాలేదు. 'ఏంటి ఇక్కడికి తీసుకొచ్చావు. నాకు చాలా పని ఉంది. త్వరగా చెప్పు' అని నేహ నిర్లక్ష్యంగా అంది. అప్పుడు వెన్నెల ప్రవళిక ఇంటి వైపు చూపించింది. అది ఓ చిన్న మట్టి ఇల్లు. 'ఆ ఇంట్లో ప్రవళిక అమ్మానాన్న, తాత, అవ్వ, అక్క, తమ్ముడు అందరూ ఉంటారు. పెద్ద వాళ్లందరూ కూలీకి వెళతారు. ప్రవళిక ఒక్కత్తే చదువుకుంటోంది. వాళ్ల అక్క, తమ్ముడిని చూసుకునేందుకు చదువు మానేసింది. ఈ పరిస్థితుల్లో ప్రవళికకి చదువు చాలా ముఖ్యం. ఒకప్పుడు నాతో పోటీపడి మరీ చదివేది. మార్కులు బాగా వచ్చేవి. కానీ ఇప్పుడు అలా లేదు. అది చదువులో బాగా వెనకబడిపోయింది. నాకు తెలిసి మీ అమ్మానాన్న ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. నీకు కూడా చదువు విలువ తెలుసు. కానీ నువ్వు చదువుని బాగా అశ్రద్ధ చేస్తున్నావు. నీతో స్నేహం చేసి ప్రవళిక కూడా మారిపోయింది. ఇకనైనా మీరిద్దరూ చదువుపై శ్రద్ధ పెట్టండి. ప్రవళిక రోజురోజుకీ చదువులో వెనకపడిపోతుంటే నాకు చాలా బాధగా ఉంది. ఏం చేయాలో తెలియకే నిన్ను ఇక్కడికి పిలిచాను' అని వెన్నెల ఏడుస్తూ చెప్పింది.

అప్పుడే బజారుకి వెళ్లి తిరిగి వచ్చిన ప్రవళిక ఈ సంభాషణ అంతా విన్నది. తన కోసం స్నేహితురాలు ఇంతలా ఆలోచిస్తున్నందుకు ఎంతో సంతోషపడింది. తన తప్పు తెలుసుకుంది. ఆ రోజు నుండి నేహలో కూడా చాలా మార్పు వచ్చింది. చదువుపై శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ప్రవళికతో పాటు నేహ కూడా వెన్నెలతో స్నేహం చేస్తోంది.



– గుంజ వెన్నెల,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోదాడ,
సూర్యాపేట జిల్లా,
తెలంగాణ.

నేను గీసిన బొమ్మ






వి.హెప్సిబా,
9వ తరగతి,
అరవిందహైస్కూలు,
కుంచనపల్లి, గుంటూరుజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇప్పుడు కొత్తగా కోల్పోయేది ఏమీలేదు..

ఆమె, అఘాయిత్యానికి బలై నాలుగు నెలలు కావస్తోంది. కళ్ల ముందే నిందితులు ఉన్నా, వాళ్లనింకా దోషులుగా గుర్తించలేదు. దేశమంతా నిరసనలు ఎగిసిపడిన వేళే, న్యాయం కోసం పోరాడుతున్న అమ్మానాన్నను రకరకాలుగా వేధించారు. భయపెట్టారు. బెదిరించారు. దాడులు చేశారు, చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, వాళ్లకి ప్రాణ హాని ఉందని తెలిసినా నెల రోజుల నుండి వారి ఇంటి చుట్టూ ఉన్న రక్షణ వలయాన్ని తగ్గించింది ప్రభుత్వం. కలకత్తా ఆర్‌జి కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన ట్రైనీ డాక్టరు అమ్మానాన్న గురించే ఇప్పుడు మనం చెప్పకుంటోంది.



ఆగస్టు 9న ఈ దుర్ఘటన జరిగింది. మూడు నెలల వరకు ట్రైనీ డాక్టరు ఇంటి ముందు పోలీసు పహారా ఉండేది. కలకత్తా సరిహద్దుల్లో ఉన్న ఆ ఇల్లు పోలీసు బారికేడ్ల మధ్య, ఇంటరాగేషన్ నిమిత్తం డజన్ల కొద్దీ పోలీసు సందర్శనలతో బిజీగా ఉండేది. ఆ ఇంటికి వెళ్లే వీధులన్నీ నిరసనల నినాదాల బ్యానర్లతో నిండిపోయి ఉండేవి. కానీ ఇప్పుడు నిరాయుధులైన ఓ ముగ్గురు పోలీసులు ఆ ఇంటి ముందు ఉన్నారు. వీధుల్లో ఏ బ్యానరూ కనిపించడం లేదు. ఈ సమయంలోనే ఆ డాక్టరు అమ్మానాన్న కూతురి కోసం సోషల్‌మీడియా వేదికగా పోరాటానికి సిద్ధమయ్యారు. 'ట్రూత్ అండ్ జస్టిస్ : వాయిస్ ఫర్ ఆర్‌జి కర్ విక్టిమ్' పేరుతో ఓ పేజీని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాళ్లకు న్యాయం జరిగిందా? వాళ్లు ఏం కోరుకుంటున్నారు? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? వంటి అనేక విషయాలపై వాళ్లు ఏమనుకుంటున్నారో చూద్దాం..

జరిగిన విచారణపై సంతృప్తిగానే ఉన్నారా!

లేదు, ఎంతమాత్రమూ లేరు. పోలీసులు మొదట సంజయ్‌రాయ్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తిస్తూ అరెస్టు చేశారు. ఆ తరువాత సిబిఐ మరో ఇద్దరిని అరెస్టు చేసింది. అయితే ఇంతవరకు చార్జిషీటు దాఖలు చేయలేదు. 'దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థకి కేసు విచారణ వెళ్లిందని, త్వరగా న్యాయం జరుగుతుందని మేం భావించాం. కానీ ఈ జాప్యం మమ్మల్ని ఎంతో బాధిస్తోంది. పోలీసులు కావాలనే సాక్ష్యాలను తారుమారు చేసారు. సిబిఐ దర్యాప్తులో ఏం తేలుతుందో చూడాలి' అంటున్నాడు ఆ తండ్రి తడిబారిన కన్నులతో.

ఇప్పటివరకు జరిగిన సిబిఐ పరిశీలనలు, రాష్ట్ర పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ఒకే నేరస్తుడిని సూచిస్తున్నాయి. దీనిపై ఆ తండ్రి మాట్లాడుతూ, 'మూసి ఉన్న గదిలో నా బంగారు తల్లి హత్యాచారానికి గురైంది. సిబిఐని నమ్మడం తప్ప మాకు వేరే మార్గం లేదు. ప్రపంచమంతా ఈ కేసుపై మాట్లాడుతోంది. న్యాయంపై మాకు నమ్మకం ఉంది' అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

వాళ్లని దూరం పెడుతున్నాం..

తల్లిదండ్రుల అనుమతి తీసుకోకుండా, స్థానిక తృణమూల్ కాంగ్రెస్ కౌన్సిలర్ ఆ అమ్మాయి మృతదేహాన్ని దహనసంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సన్నిహితుడని చెప్పి, అంతిమసంస్కారాల దరఖాస్తు ఫారంపై సంతకం కూడా చేశాడు. దీనిపై బాధితురాలి తల్లి మాట్లాడుతూ, 'ఆ మనుషులు మాతో సంబంధాలు పెంచుకోవాలని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ మాకు అది ఇష్టం లేదు. ఆ వ్యక్తులకు దూరంగా ఉండాలని మేం నిర్ణయించుకున్నాం. మాకు మద్దతుగా నిలవాల్సిన వ్యక్తులే మా నుండి దూరంగా జరిగారు. ఆర్ జి కర్ ఆస్పత్రి డాక్టర్లు, విద్యార్థులపై ఏ ఒత్తిడి ఉందో మాకు తెలియదు. వారంతా మాతో కలసిరావడం లేదు. ఇతర కాలేజీ పిల్లలతోనే మా నిరసనలను ముందుకు తీసుకెళు_న్నాం' అని ఆ తల్లి కూతురి ఫొటోని చేతితో నిమురుతూ పదే పదే దాని వైపు చూస్తూ చెబుతోంది. అలా చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో కన్నీటి వర్షం కురుస్తోంది.

రోజంతా ఎదురుచూసినా అమిత్ షా మాతో మాట్లాడలేదు..

సిబిఐ విచారణ జరుగుతున్నప్పుడే కేంద్ర మంత్రి అమిత్ షా నగరానికి వచ్చారు. ఆయనని కలుసుకోవాలని దంపతులిద్దరూ ఎంతో ప్రయత్నించారు. ఆ సందర్భాన్ని వారు ఇలా గుర్తుచేసుకున్నారు. సిబిఐ చర్యలపై, ఛార్జీషీట్‌పై మాకు అనేక అనుమానాలున్నాయి. ఈవిషయంపై షాతో మాట్లాడాలని మేము చాలా ప్రయత్నించాం. ఆయన జోక్యంతో విచారణ వేగవంతమవుతుందని భావించాం. కానీ రోజంతా ఎదురుచూసినా కొన్ని నిముషాల టైం కూడా మాకు కేటాయించలేదు. ఆ రోజు రాష్ట్ర బిజెపి ప్రతినిధి మాతో చాలా దురుసుగా ప్రవర్తించారు. కనీస మానవత్వం లేకుండా స్పందించారు. సంఘటన జరిగినప్పుడు బిజెపి పెద్దలంతా మాకు మద్దతుగా నిలబడతామని చెప్పారు. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ వారు కూడా రాష్ట్ర పాలకుల వలె తయారయ్యారు. మా బిడ్డ పట్ల మమత ప్రభుత్వానికి, బిజెపి పాలకులకు ఎటువంటి చిత్తశుద్ధి లేదని మేము త్వరగానే గ్రహించాం' అంటున్నాడు.

నిందితులు ఇంకా దోషులుగా తేలలేదు

'ఈ కేసులో నలుగురికి ప్రమేయం ఉందని మేము మొదటి నుండి చెబుతున్నాం. అయినా వాళ్లని అరెస్టు చేయడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. నిందితులు ఇంకా దోషులుగా తేలలేదు. కాలేజ్ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ ఎటువంటి పరిణామాలను ఎదుర్కొనలేదు. ఇదంతా చూస్తుంటే మాకు చాలా ఆశ్చర్యంగా ఉంది' అంటున్నారు.

సుప్రీంకి వెళ్లినా సంతృప్తిగా లేదు

కలకత్తా హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సందర్భంలోనే దేశవ్యాప్తంగా ఈ అంశంపై వెల్లువెత్తిన నిరసనలకు గాను, సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటాగా స్వీకరించి విచారణ చేసింది. 'హై కోర్టు నుండి ఏడు రిపోర్టు కవర్లను సుప్రీం పరిశీలించింది. అందులో ఏముందో మాకు తెలియదు. ఆ తరువాత సుప్రీం సిబిఐకి ఎలాంటి కొత్త మార్గదర్శకాలు ఇవ్వలేదు. మేము చాలా నిరాశలో ఉండిపోయాం. కేసు ఎప్పటికి తేలుతుందో, నా బిడ్డకి ఎప్పుడు న్యాయం జరుగుతుందో అర్థం కావడం లేదు' అని ఆ తండ్రి దీనవదనంతో చెబుతున్నాడు.

పోరాట గళాలనూ అణగదొక్కుతున్నారు..

సంఘటన జరిగిన తరువాత దేశ నలుమూలల నుండి వచ్చిన నిరసనకారులతో కలకత్తా నగర వీధులు నిండిపోయాయి. మరోపక్క కేసును వెనక్కి తీసుకోమని, వైద్య విద్యార్థి తల్లిదండ్రులకు ధనాశ చూపించారు. చంపేస్తామని బెదిరించారు. అయినా వెనక్కి తగ్గక పోయేసరికి మద్దతుగా నిలబడిన వారిపై వేధింపులు చేస్తున్నారు. వారి ఉద్యోగాలు ఊడగొట్టారు. అలా పంకజ్ దత్తా అనే మాజీ పోలీసు అధికారిపై ఓ బృందం చేసిన వేధింపులకు గాను, ఆయన మరణించాడు. 'ఆ అధికారి మొదటి నుండి మాతో ఉన్నారు. ఆయన మరణంతో మమ్మల్ని భయపెట్టాలని చూశారు. కానీ మేం మరింత శక్తివంతంగా తయారయ్యాం. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆయన భార్యకి అండగా నిలబడ్డాం. ఈ అన్యాయాలను మేము వీధుల్లోకి తీసుకెళ్తున్నాం. ఆ మార్గాలే మమ్మల్ని ముందుకు నడిపిస్తాయి' అంటున్నారు ఆ తల్లీదండ్రీ.

కృతజ్ఞతలు..

'మా ఇంటి బిడ్డని ఈ ప్రపంచం తన బిడ్డగా భావించింది. మాకు మద్దతుగా నిరసనలు చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మన రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థని గౌరవిస్తున్నాం' అంటున్న ఆ అమ్మానాన్న 'మేము ఇప్పుడు ప్రత్యేకంగా కోల్పోయేది ఏమీ లేదు. ఆగస్టు 9నే మా నుండి ప్రతిదీ పోగొట్టుకున్నాం. ఇప్పుడు మేం మా కోసం కాదు.. మా బిడ్డ కోసం కాదు.. అన్యాయం అయిపోయిన ఎందరో ఆడబిడ్డల తల్లితండ్రుల ప్రతినిధులుగా ఈ నిరసనలను మరింతగా ముందుకు తీసుకెళతాం' అంటున్నారు.



'హరికథ'లో పాత్ర గొప్ప అవకాశం : రాజేంద్రప్రసాద్

'ఎన్టీఆర్, ఎఎన్నార్ చేయాల్సినంత గొప్ప పాత్రలో నటించే అవకాశం 'హరికథ' సిరీస్‌తో నాకు దక్కింది. బాగా నటించి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంగా నటిస్తా'అని సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ 'హరికథ' పేరుతో మరో వెబ్ సిరీస్‌ను రూపొందిస్తోంది. హాట్‌స్టార్ స్పెషల్స్‌గా ఈ సిరీస్ స్ట్రీమింగ్‌కు రాబోతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. మ్యాగీ దర్శకత్వం వహిస్తున్నారు. దివి, పూజిత పొన్నాడ, రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, మౌనికరెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రియా కొట్టం, ఉషశ్రీ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్‌కు రానుంది. హైదరాబాద్‌లో సోమవారంనాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత సురేష్ జై, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శశికిరణ్ నారాయణ, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి తదితరులు మాట్లాడారు.

బన్నీకి అమితాబ్ ప్రశంస



పుష్ప-2 సినిమాకు హిట్ టాక్ రావటంతో అల్లు అర్జున్ (బన్నీ)పై బాలీవుడ్ స్టార్ అమితాబ్‌బచ్చన్ ప్రశంసలు కురిపిం చారు. బన్నీ గతంలో మాట్లాడిన వీడియోను అమితాబ్ షేర్‌చేశారు. 'అల్లు అర్జున్ గారు నేనే మీ మాటలకు ఉప్పొంగిపోతున్నా. మీరు నాకు అర్హత కంటే ఎక్కువ క్రెడిట్ ఇస్తున్నారు. మేము మీ పని, అలాగే ప్రతిభకు పెద్ద అభిమానులం. మీరు మా అందరికీ స్ఫూర్తిని ఇస్తూనే ఉండండి. మీరు భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు ఎన్నో చూడాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. బంగారు భవిష్యత్తుకు ఆల్ ది బెస్ట్. మీరు ఇలాంటి సక్సెస్‌లు ఎన్నో అందుకోవాలి' అంటూ తన ఎక్స్ ద్వారా తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఫియర్ ట్రైలర్ విడుదల

నటి వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'ఫియర్'. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ప్రొడ్యూసర్లు డాక్టర్ వంకి పెంచలయ్య, ఎఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాతరెడ్డి కోప్రొడ్యూసర్. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డాక్టర్ హరిత గోగినేని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో నటించారు. ట్రైలర్‌ను నటుడు మాధవన్ ఆవిష్కరించారు. 'ట్రైలర్ చాలా చక్కగా వచ్చింది. సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఆద్యంతం ఆకట్టుకుంటుంది.. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని మాధవన్ అన్నారు. అనూప్ రూబెన్స్ అందించింది బీజీఎం, ఐ ఆండ్రూ విజువల్స్ బాగా వచ్చాయి. ఈనెల 14న ఈ సినిమా విడుదల కానుంది. జయప్రకాష్, పవిత్ర లోకేష్, అనీష్ కురవిల్ల, సాయాజి షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటిస్తున్నారు.

త్వరలో 'ఆర్‌ఆర్‌ఆర్ : బిహైండ్ అండ్ బియాండ్

రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ఆస్కార్‌తోపాటు పలు అంతర్జాతీయ అవార్డులు అందుకుంది. ఎన్‌టిఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా డి.వి.వి దానయ్య నిర్మించిన ఈ చిత్రం 2022లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. తాజాగా ఈ చిత్రబృందం ఒక ప్రకటన చేసింది. ఈ సినిమాపై డాక్యుమెంటరీ సిద్ధం చేసినట్లు తెలిపింది. 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో ఈ డాక్యుమెంటరీ రానున్నట్లు ప్రకటించింది. "ఆర్‌ఆర్‌ఆర్ కీర్తిని ప్రపంచం మొత్తం చూసింది. ఇప్పుడు దీని కథకు ప్రపంచం సాక్ష్యంగా నిలవనుంది' అంటూ ఈ ప్రాజెక్ట్ గురించి వెల్లడించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా తెరవెనక ఏం జరిగింది.. దీన్ని ఎలా రూపొందించారో ఇందులో చూపనున్నారు. ఈ డాక్యుమెంటరీ ఈ డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే దీనిని థియేటర్‌లలో విడుదల చేస్తారా? ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

'మంచు' కుటుంబంలో ఆస్తుల లొల్లి

- రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన మోహన్‌బాబు
- కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని మనోజ్ ఫిర్యాదు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో విభేదాలు తారస్థాయికి చేరాయి. తనకు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు, తన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని మోహన్‌బాబు కుమారుడు మనోజ్ వేర్వేరుగా పోలీసులను ఆశ్రయించారు. తన కుమారుడు, నటుడు మనోజ్, ఆయన భార్య మౌనికపై చర్యలు తీసుకోవాలని రాచకొండ కమిషనర్‌కు మోహన్‌బాబు సోమవారం ఫిర్యాదు చేశారు. తన ప్రాణానికి, ఆస్తులకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో ఆయన పోలీసులను కోరారు. అసాంఘిక శక్తులుగా మారిన కొందరి నుంచి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. 'నేను జల్‌పల్లిలో పదేళ్లగా నివసిస్తున్నాను. నాలుగు నెలల కిందట నా చిన్న కొడుకు ఇల్లు వదిలి వెళ్లాడు. కొందరు సంఘ వ్యతిరేకులతో కలిసి మనోజ్... నా ఇంటి వద్ద కలవరం సృష్టించాడు. మనోజ్ తన ఏడు నెలల కుమార్తెను ఇంటి పని మనిషి సంరక్షణలో విడిచిపెట్టాడు. మాదాపూర్‌లోని నా కార్యాలయంలోకి 30 మంది వ్యక్తులు చొరబడి సిబ్బందిని బెదిరించారు. మనోజ్, మౌనిక నా ఇంటిని అక్రమంగా ఆక్రమించుకొని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. నా భద్రత, విలువైన వస్తువులు, ఆస్తుల విషయంలో భయపడుతున్నాను. నాకు హాని కలిగించే ఉద్దేశంతో వారున్నారు. నా నివాసాన్ని శాశ్వతంగా ఖాళీ చేయాలని బెదిరించారు. సంఘ విద్రోహులుగా మారి నా ఇంట్లో ఉన్న వారికి ప్రాణహాని కలిగిస్తున్నారు. చట్టవిరుద్ధంగా నా ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు వారిద్దరూ ప్లాన్ చేశారు. నేను




70 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్‌ని. మనోజ్, మౌనిక, వారి సహచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నా భద్రత కోసం అదనపు సిబ్బందిని కేటాయించండి. నా ఇంట్లో ఎలాంటి భయమూ లేకుండా గడిపేందుకు రక్షణ కల్పించండి' అని మోహన్‌బాబు తన ఫిర్యాదులో కోరారు.

పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో మనోజ్ ఫిర్యాదు

తనపై దాడి జరిగిందంటూ నటుడు మంచు మనోజ్ సోమవారం పహాడీషరీఫ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుతో పాటు తన మెడికల్ రిపోర్టునూ అందజేశారు. ఈ వ్యవహారంపై పహాడిషరీఫ్ సిఐ గురువారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'ఇంట్లో ఉండగా పదిమంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేశారని మనోజ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. దాడి చేసిన తర్వాత వారంతా పారిపోయారని మనోజ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, తన కుటుంబం సభ్యులకు ప్రాణహాని ఉందని, దాడి చేసిన వారి వివరాలు మాకు చెప్పలేదు. మనోజ్ ఒక్కరికే గాయాలయ్యాయి. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తాం. మనోజ్‌పై దాడి చేసిన వారిని పట్టుకునే ప్రయత్నం చేస్తాం' అని తెలిపారు.

12వ రౌండ్‌లో గుకేశ్ ఓటమి

- డింగ్ లిరెన్ గెలుపుతో టైటిల్‌పై ఉత్కంఠ
- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్



సింగపూర్: భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌ల మధ్య జరుగుతున్న ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. తొలి మూడు గేమ్‌లు ముగిసేసరికి ఇరువురు ఒక్కో గేమ్‌లో మాత్రమే గెలిచారు. ఆ తర్వాత వరుసగా ఏడు గేమ్‌లు డ్రాగా ముగించారు. సుదీర్ఘ డ్రాల పర్వానికి గుకేశ్ ఆదివారం జరిగిన 11వ గేమ్‌లో చెక్ పెట్టాడు. ఆ గేమ్‌లో భారత గ్రాండ్ మాస్టర్ విజయం సాధించగా.. సోమవారం జరిగిన 12వ రౌండ్ గేమ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్‌పై విజయం సాధించాడు. 11వ గేమ్‌లో గుకేశ్ 29 ఎత్తుల్లోనే డింగ్‌కు చెక్ పెడితే.. 12వ గేమ్‌లో డింగ్.. 39 ఎత్తుల్లో గుకేశ్‌కు చెక్ పెట్టాడు. దీంతో 12 గేమ్‌లు ముగిసేసరికి ఇరువు 6-6పాయింట్లతో సమంగా నిలిచారు. సోమవారం జరిగిన 12వ గేమ్‌లో డింగ్ లిరెన్ తెల్ల పావులతో సి-4తో గేమ్‌ను ప్రారంభించగా.. నల్లపావులతో ఆడిన గుకేశ్.. సి-6తో గేమ్‌ను ప్రారంభించాడు. ఈ గేమ్ సుమారు 39ఎత్తులపాటు సాగింది. చివరి ఏడు నిమిషాల్లో గుకేశ్ 15ఎత్తులు వేయాల్సి రావడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. 12వ గేమ్ ముగిసిన అనంతరం మాజీ ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ మాట్లాడుతూ.. ఆ తర్వాత గేమ్‌లలో గుకేశ్ పుంజుకోవడం ఖాయమని జోస్యం చెప్పాడు. మరో రెండు గేమ్‌ల ఆట మాత్రమే మిగిలి ఉంది. మొత్తం 14రౌండ్‌ల జరిగే టైటిల్ సంగ్రామంలో 7.5 పాయింట్లు సాధించిన తొలి గ్రాండ్‌మాస్టర్‌కు ప్రపంచ చెస్ టైటిల్ దక్కనుంది. 14 గేమ్‌లు ముగిసిన తర్వాత ఇరువురికి సమ పాయింట్లు ఉన్న పక్షంలో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ వెళ్లాల్సి ఉంటుంది.

హర్యానా చేతిలో టైటాన్స్ చిత్తు

ప్రొ కబడ్డీ సీజన్-11

పూణే: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ మరో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. రెండ్రోజుల క్రితం బెంగాల్ వారియర్స్‌పై సంచలన విజయం సాధించిన టైటాన్స్.. సోమవారం జరిగిన 17వ మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ చేతిలో 25-46పాయింట్ల తేడాతో చిత్తుగా ఓడింది. టైటాన్స్ జట్టులో ఆశీశ్(13) రైడ్ పాయింట్లు సాధించినా.. విజయ్(5) రాణించలేకపోయాడు. ట్యాకిల్స్‌లోనూ నిరాశపరచడంతో హర్యానా పుంజుకుంది. ఇక హర్యానా జట్టులో శివమ్(12), వినయ్(7)రైడ్స్‌లో రాణించారు. ఓవరాల్‌గా హర్యానా 27పాయింట్లు రైడ్‌ల రూపంలో, 13పాయింట్లు ట్యాకిల్స్ ద్వారా సాధించింది. అలాగే 4సార్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేయడం కూడా ఆ జట్టుకు కలిసొచ్చింది.

రెండో టెస్టులో దక్షిణాఫ్రికా గెలుపు



గిబెర్హా: శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 109 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-0 తేడాతో చేక్కించుకుంది.. సెయింట్ జార్జ్ పార్క్‌లో జరిగిన ఈ టెస్ట్‌లో 348 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక.. చివరి అయిదు వికెట్లను లంక త్వరగా కోల్పోయింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా, కుశాల్ మెండిస్ కొంత సేపు ప్రతిఘటించినా.. చివరకు శ్రీలంక 238 పరుగుల వద్ద లంచ్‌కు ముందే ఆలౌటైంది. స్పిన్నర్ మహారాజ్‌కు ఐదు వికెట్లు దక్కాయి. టెస్టుల్లో అయిదేసి వికెట్లు తీయడం అతనికి ఇది 11వసారి. సిరీస్‌ను కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా.. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో 63.33 పాయింట్లతో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది.

నాకౌట్‌లో ఆంధ్ర ఓటమి

యుపి చేతిలో ఓటమితో క్వార్టర్స్ బెర్త్

సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. చిన్నస్వామి స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 156పరుగులు చేసింది. కెప్టెన్ రికీ బుయ్(25), నాగవరప్రసాద్(34నాటౌట్), శశికాంత్(23నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. యుపి బౌలర్లు భువనేశ్వర్ కుమార్, నిగమ్‌కు రెండేసి, మొహిసిన్ ఖాన్, శివమ్ మావికి ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఉత్తరప్రదేశ్ జట్టు 19ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ కరణ్ శర్మ(48), రింకు సింగ్(27నాటౌట్), నిగమ్(27నాటౌట్; 8బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) మ్యాచ్‌ను ముగించారు. ఆంధ్ర బౌర్లు సుదర్శియన్‌కు మూడు, త్రిపురనకు రెండు, రాజుకు ఒక వికెట్ దక్కాయి.

బెంగాల్‌ను క్వార్టర్స్‌కు చేర్చిన షమి

టీమిండియా పేసర్ మహ్మద్ షమీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. ఛత్తీస్‌గడ్‌తో సోమవారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో బెంగాల్ తరఫున బ్యాటింగ్‌కు దిగి షమీ.. 17బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 32 పరుగులు చేసి గెలిపించాడు. దీంతో ఛత్తీస్‌గడ్ నిర్దేశించిన 157పరుగుల లక్ష్యాన్ని బెంగాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి ఛేదించింది. 16ఓవర్లు ముగిసేసరికి 8వికెట్ల కోల్పోయి 114పరుగులతో ఓటమి కోరల్లో ఉన్న దశలో క్రీజ్‌లోకి వచ్చి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. దీంతో బెంగాల్ జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68